# ప్రభాత సూర్యుడు

తెలుగు దినపత్రిక

RANGAREDDY, EDITION : 01, VOLUME :119 EDITOR:CHERUKU UPENDAR, DATE : TUESDAY 05 SEPTEMBER 2023 PAGES:4, RATE: Rs.5/-

రంగారెడ్డి సంపుటి : 01 సంచిక : 119 ఎడిటర్ : చెరుకు ఉపేందర్ తేదీ : మంగళవారం 05 సెప్టెంబర్ 2023 పేజీలు : 4 వెల : 5/-


## స్లీప్ మోడ్‌లోకి చంద్రయాన్

హైదరాబాద్ - ప్రభాత సూర్యుడు



భారత అంతరిక్ష పరిశోధనా సంస్థ (ఇస్రో) చంద్రుడిపైకి పంపిన చంద్రయాన్–3 లోని రోవర్ ప్రజ్ఞాన్ తన పనిని పూర్తి చేసినట్లుగా ప్రకటించింది. ఇక దాన్ని తాము సురక్షితంగా పార్క్ చేశామని వెల్లడించింది. రోవర్‌కు తాము ఇచ్చిన

మిగతా 2 లో...

## జీ 20కు హస్తిన ముస్తాబు

ఢిల్లీకి రానున్న దేశాధినేతలు



న్యూఢిల్లీ - ప్రభాత సూర్యుడు

జీ–20 సదస్సును భారత ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా తీసుకుంది. సమావేశాలకు వచ్చే ప్రముఖులకు అతిథి మర్యాదలు చేసేందుకు ప్రత్యేక ఏర్పాట్లు చేస్తున్నారు. ప్రపంచ దేశాధినేతలకు చక్కటి ఆతిథ్యం ఇచ్చేందుకు అధికారులు ఏర్పాట్లు చేపడుతున్నారు. వారి కోసం దేశ రాజధాని ఢిల్లీలో ప్రముఖ హోటళ్లను ఇప్పటికే బుక్ చేశారు. సదస్సుకు వచ్చే ప్రతినిధులకు వారికి భారత వంటలను రుచి చూపించేందుకు, భారత

మిగతా 3లో...

# కమలంలో... అభ్యర్థుల కసరత్తు

## టిక్కెట్ల కోసం క్యూ

హైదరాబాద్ - ప్రభాత సూర్యుడు

తెలంగాణ బీజేపీ అసెంబ్లీ అభ్యర్థుల ఎంపిక కసరత్తును ప్రారంభించింది. సోమవారం ఉదయం నుంచి దరఖాస్తులు స్వీకరిస్తున్నారు. నాంపల్లిలోని రాష్ట్ర పార్టీ కార్యాలయంలో ఇందు కోసం ప్రత్యేకమైన ఏర్పాట్లు చేశారు. సెప్టెంబర్ 10వ తేదీ వరకు ఈ దరఖాస్తులను స్వీకరించనున్నారు. బీజేపీ అభ్యర్థుల ఎంపికలో ఇది సరికొత్త సంప్రదాయం. పార్టీ చరిత్రలోనే బీజేపీ పార్టీలో తొలిసారి అభ్యర్థుల ఎంపికకు దరఖాస్తులు స్వీకరిస్తున్నారు. ఇప్పటి వరకూ అభ్యర్థుల ఎంపిక కోసం దరఖాస్తులు తీసుకోలేదు. ఇతర పార్టీల్లో ఉన్న వారైనా దరఖాస్తు చేసుకునే అవకాశాన్ని కల్పించింది. అయితే పూర్తి వివరాలను వెల్లడించాల్సి ఉంటుంది. ప్రస్తుతం పార్టీలో ఏదైనా పదవిలో కొనసాగితే వాటి వివరాలతో పాటు సోషల్ మీడియా అకౌంట్ల సమాచారం కూడా కోరింది. దరఖాస్తు ప్రత్యేక ఫారంను మొత్తం నాలుగు విభాగాలుగా రూపొందించిన రాష్ట్ర నాయకత్వం.. మొదటి విభాగంలో వ్యక్తి బయోడేటా, చేసిన రాజకీయ కార్యక్రమలను అడుగుతోంది. ఇక రెండో విభాగంలో గతంలో పోటీ చేసిన ఎంపీ, ఎమ్మెల్యే, స్థానిక సంస్థలు వివరాలు అందులో వచ్చిన ఓట్లను ప్రశ్నిస్తుంది. మూడో ప్రస్తుతం పార్టీలో నిర్వహిస్తున్న బాధ్యతలను అడుగుతుంది. చివరి నాలుగో విభాగంలో ఏమైన క్రిమినల్ కేసులు ఉంటే వాటి వివరాలు, శిక్షపడిన కేసులు వివరంగా పొందుపరచాలని కోరుతోంది. టిక్కెట్ల కోసం వచ్చిన దరఖాస్తులను మూడు దశలో వడపోత

మిగతా 2 లో...

## హైదరాబాద్ లో వానలే... వానలు



హైదరాబాద్ - ప్రభాత సూర్యుడు

హైదరాబాద్‌లో నిన్నటి నుంచి కురుస్తున్న వర్షాలకు లోతట్టు ప్రాంతాలు జలమయం అయ్యాయి. చాలా ప్రాంతాల్లో రోడ్లపై వర్షం నీరు వేగంగా ప్రవహిస్తోంది. భారీ వర్షానికి జన జీవనం పూర్తిగా అస్తవ్యస్తం అయ్యింది. ఈ క్రమంలో హైదరాబాద్ గాంధీ నగర్ పోలీస్ స్టేషన్ పరిధిలో విషాదం చోటు చేసుకుంది. హుస్సేన్ సాగర్ నాలాలో పడి ఓ మహిళ గల్లంతైంది. తన అమ్మ కనిపించడం లేదని సదరు మహిళ కుమార్తె గాంధీనగర్ పోలీసులకు ఫిర్యాదు చేసింది.గాంధీ నగర్ పోలీస్ స్టేషన్ పరిధిలోని ఎస్‌బీఐ కాలనీ దామోదరం సంజీవయ్య నగర్‌లో లక్ష్మి (55) అనే మహిళ ఉంటుంది. ఆమెకు ముగ్గురు కుమార్తెలు. ముగ్గురుకి వివాహం అవ్వడంతో ఇంట్లో ఆమె ఒంటరిగా ఉంటోంది.
ఇటీవల వర్షానికి గోడ కూలిపోవడంతో.. ప్రహరీ

మిగతా 2లో...

## కాంగ్రెస్‌లో అంతా సీక్రెట్

హైదరాబాద్ - ప్రభాత సూర్యుడు

తెలంగాణలో అధికారమే లక్ష్యంగా కాంగ్రెస్ పార్టీ పావులు కదుపుతోంది. అసెంబ్లీ ఎన్నికల అభ్యర్థుల ఎంపిక కసరత్తులో వేగం పెంచింది. తెలంగాణ అసెంబ్లీ అభ్యర్థుల విషయంలో పూర్తి గోప్యత పాటిస్తోంది. ప్రదేశ్ ఎన్నికల కమిటీ నివేదిక సోమవారం స్క్రీనింగ్ కమిటీ ముందుకు చేరనుంది. గాంధీభవన్‌లో ఉదయం 11 నుంచి పీఈసీ సభ్యులతో స్క్రీనింగ్ కమిటీ వ్యక్తిగతంగా సమావేశం అయింది. సాయంత్రం వరకు ఈ ముఖాముఖి సమావేశాలు కొనసాగాయి. కేంద్ర ఎన్నికల కమిటీ ప్రకటించే జాబితానే ఫైనల్. తర్వాత మంగళవారం గాంధీ భవన్‌లో పీఈసీలో లేని మాజీ మంత్రులు, మాజీ ఎంపీలతో స్క్రీనింగ్ కమిటీ భేటీ కానుంది. పీఈసీ, ఇతర సీనియర్ నేతల అభిప్రాయం మేరకు 6 తేదీన అభ్యర్థుల ఎంపికపై నివేదికను సిద్ధం చేస్తుంది. 7 తేదీన సెంట్రల్ ఎలక్షన్ కమిటీకి నివేదిక సమర్పిస్తుంది. ఆ తర్వాతే కాంగ్రెస్ తరపున అభ్యర్థుల జాబితా ప్రకటన వెలువడనుంది. ఈ మొత్తం ప్రాసెస్‌లో ఏం జరుగుతుందో తనకు కూడా తెలియదని తెలంగాణ కాంగ్రెస్ చీఫ్ రేవంత్ రెడ్డి చెప్పడం విశేషం. అయితే ఈసారి బీసీలకు పెద్ద పీట వేయబోతున్నామని ఆయన చెబుతున్నారు. ప్రదేశ్ ఎన్నికల కమిటీ సభ్యులు ఆదివారం గాంధీభవన్‌లో తమ తమ అభిప్రాయాలతో అభ్యర్థుల పేర్లతో నివేదిక రూపొందించిన సంగతి తెలిసిందే. నియోజకవర్గాల వారీగా ఎంపిక చేసిన అభ్యర్థుల పేర్లకు ముందు టిక్‌ను ఉంచారు.

మిగతా 2లో...

బీజేపీ, కాంగ్రెస్ పాలిత

## రాష్ట్రాల్లోనే విద్యుత్ లోటు

మంత్రి కేటీఆర్



హైదరాబాద్ - ప్రభాత సూర్యుడు

బీజేపీ, కాంగ్రెస్ పార్టీలపై మంత్రి కేటీఆర్ మరోసారి వ్యంగ్యాస్త్రాలు సంధించారు. డబుల్ ఇంజిన్ సర్కార్ అంటూ గొప్పలు చెప్పుకునే బీజేపీ పాలిత రాష్ట్రాలతోపాటు కాంగ్రెస్ పరిపాలించే రాష్ట్రాల్లోనే విద్యుత్ లోటు అధికంగా ఉందని విమర్శించారు. 2013–14లో విద్యుత్ లోటుతో ఉన్న తెలంగాణ ఇప్పుడు మిగులు రాష్ట్రమని చెప్పారు.తలసరి విద్యుత్ వినియోగంలోనూ తెలంగాణ దేశంలోనే అగ్రస్థానంలో ఉందని చెప్పారు. రైతులకు 24 గంటల ఉచిత కరెంటు ఇస్తున్నామని వెల్లడించారు. అందుకే తెలంగాణ అభివృద్ధి మోడల్ దేశానికే ఉత్తమ నమూనా అంటూ ట్వీట్ చేశారు.

## ఇల్లెందు బరిలో మహిళా ప్రొఫెసర్




ఖమ్మం- ప్రభాత సూర్యుడు

అసెంబ్లీ ఎన్నికలు సమీపిస్తున్న వేళ ఎస్టీ రిజర్వుడు నియోజక వర్గమైన ఇల్లందు రాజకీయాలు ఆసక్తికరంగా మారుతున్నాయి. ఈ సీటు నుంచి పోటీ చేయాలని చాలా మంది భావిస్తున్నారు. ఇదిలా ఉంటే? ఓ మహిళా ప్రొఫెసర్ కూడా ఈ జాబితాలో చేరిపోయింది. రాష్ట్రంలో ఎన్నికల వేడి మొదలైంది. నోటిఫికేషన్ రాకముందే అభ్యర్థుల జాబితాపై ప్రధాన పార్టీలు దృష్టిపెట్టాయి. బీఆర్ఎస్ ఇప్పటికే అభ్యర్థులను(115) ప్రకటించగా.. త్వరలోనే బీజేపీ, కాంగ్రెస్ పార్టీల జాబితాలు రానున్నాయి. ఇదిలా ఉంటే... ఇతర పార్టీల నుంచి పోటీ చేయడమే కాకుండా, ఇండిపెండెంట్ గా కూడా బరిలో నిలిచే వాళ్లు ఏర్పాట్లు చేసుకునే పనిలో పడ్డారు. మరికొద్దిరోజుల్లోనే ఎన్నికల నగారా మోగబోతున్న నేపథ్యంలో.... పోటీ చేసే స్థానాలపై గురిపెట్టారు.
అయితే రిజర్వుడు నియోజకవర్గాల

మిగతా 2లో...

## ఖమ్మంలో హీటెక్కుతున్న పాలిటిక్స్

ఖమ్మం- ప్రభాత సూర్యుడు



ఖమ్మం జిల్లా రాజకీయాలు రోజుకింత ఆసక్తికరంగా మారుతున్నాయి. మాజీ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు బీఆర్ఎస్ పార్టీని వీడటం దాదాపు ఖరారైనట్టుగానే కనిపిస్తోంది. ఇక హస్తం పార్టీలో చేరేందుకు ముహూర్తం నిర్ణయించుకోవడమే తరువాయి అన్నట్టుగా పరిస్థితి కనిపిస్తోంది. ఖమ్మం జిల్లాకు చెందిన కాంగ్రెస్ నేత పొంగులేటి శ్రీనివాసరెడ్డి తాజాగా తుమ్మల నాగేశ్వరరావును కలిశారు. ఖమ్మంలోనికి తుమ్మల నివాసానికి వచ్చిన పొంగులేటి ? కాంగ్రెస్ పార్టీలోకి రావాలని ఆయనను ఆహ్వానించారు. ఆయన రాక కోసం తాము ఎదురుచూస్తున్నామని తెలిపారు. రెండు రోజుల క్రితం టీపీసీసీ అధ్యక్షుడు రేవంత్ రెడ్డి కూడా హైదరాబాద్‌లో తుమ్మలతో భేటీ అయ్యారు. పార్టీలోకి రావాలని తుమ్మలను రేవంత్ ఆహ్వానించారు.బీఆర్ఎస్ పార్టీ తనను అవమానించిన రీతిలోనే మాజీ మంత్రి తుమ్మలను ఇప్పుడు అవమానిస్తోందని పొంగులేటి శ్రీనివాసరెడ్డి విమర్శించారు. పార్టీ నుంచి మిమ్మల్ని మేము తొలగించాం, కాని మీరే వెళ్లేలా చేస్తామనే పరిస్థితిని ఃఖీా నాయకత్వం చేస్తోందని అన్నారు. అపాయింట్‌మెంట్ కూడా దొరకలేదని, ఈ విషయాలు చెప్పుకుంటే పరువు పోతుందని తెలిపారు. కాంగ్రెస్‌లో చేరాలని తుమ్మలను మనస్ఫూర్తిగా ఆహ్వానిస్తున్నానని పొంగులేటి శ్రీనివాసరెడ్డి అన్నారు. తుమ్మలతో కలిసి ఆయన మీడియాతో మాట్లాడారు. తుమ్మల రాక కోసం కాంగ్రెస్ శ్రేణులు ఎదురుచూస్తున్నాయని అన్నారు. అయితే

మిగతా 2లో...

## 16, 17 తేదీల్లో సీడబ్ల్యూసీ



హైదరాబాద్ - ప్రభాత సూర్యుడు

తెలంగాణలో విజయంపై పూర్తి స్థాయిలో దృష్టి పెట్టిన కాంగ్రెస్ పార్టీ.. పార్టీ నేతలు మొత్తం హైదరాబాద్‌కు తరలి వచ్చేలా సన్నాహాలు చేస్తున్నారు. పార్టీ కేంద్ర నాయకత్వం రంగంలోకి దిగనుంది. ఈ నెల 16, 17 తేదీల్లో హైదరాబాద్ వేదికగా కాంగ్రెస్ వర్కింగ్ కమిటీ (సీడబ్ల్యూసీ) సమావేశం జరపాలని నిర్ణయించింది. కాంగ్రెస్ అత్యున్నత నిర్ణాయక మండలి అయిన సీడబ్ల్యూసీ కార్యవర్గ పునర్ వ్యవస్థీకరణ అనంతరం జరుగుతున్న తొలి

మిగతా 2లో...

## ఇల్లెందు బరిలో మహిళా ప్రొఫెసర్

(మొదటిపేజీ తరువాయి)

నుంచి ఎక్కువ మంది బరిలో ఉండేందుకు ఆసక్తి చూపుతున్నారు. ఇటీవల కాంగ్రెస్ పార్టీ దరఖాస్తుల స్వీకరించగా... ఉమ్మడి ఖమ్మం జిల్లా పరిధిలోని ఇల్లందు సీటు కోసం ఏకంగా 36 మంది దరఖాస్తు చేసుకున్నారు. ఇక ఇతర ప్రాంతీయ పార్టీల్లో కూడా డిమాండ్ ఎక్కువగానే ఉంది. ఇదిలా ఉంటే... ఇదే ఇల్లందు సీటు నుంచి బరిలో ఉండేందుకు ఓయూకు చెందిన ఓ మహిళా ప్రొఫెసర్ రంగం సిద్ధం చేసుకున్నారు. ఆమె ఎంట్రీ ఖరారు కావటంతో... ఇల్లందు రాజకీయాలు ఆసక్తికరంగా మారాయి.వచ్చే అసెంబ్లీ ఎన్నికల్లో ఇల్లెందు నియోజకవర్గం నుంచి స్వతంత్ర అభ్యర్థిగా పోటీ చేస్తానని లా డిపార్ట్ మెంట్ ప్రొఫెసర్ గుమ్మడి అనురాధ ప్రకటించారు. ఈమె మాజీ ఎమ్మెల్యే గుమ్మడి నర్సయ్య కుమార్తె. ఇటీవలే ఇల్లెందులో మీడియాతో మాట్లాడిన ఆమె.... పోటీ విషయంపై ఓ ప్రధాన పార్టీకి చెందిన నేతలు కలిశారని, పోటీ చేయాలని కోరారని తెలిపారు. అయితే తాను మాత్రం రాజకీయ పార్టీలకు దూరంగా ఉండాలని నిర్ణయించుకున్నాని.... స్వతంత్రంగా పోటీ చేస్తానని స్పష్టం చేశారు. నియోజకవర్గాన్ని కుట్రలు, కబ్జా రాజకీయాల బారినుంచి కాపాడేందుకు ఇండిపెండెంట్ అభ్యర్థిగా బరిలో దిగుతానని చెప్పుకొచ్చారు. ఈ సందర్భంగా స్థానిక సమస్యలను కూడా ప్రస్తావించారు అనురాధ. ఇక ప్రస్తుతం గుమ్మడి అనురాధ ఉస్మానియా పీజీ న్యాయ కళాశాల ప్రిన్సిపాల్ గా పని చేస్తున్నారు. అసిస్టెంట్ ప్రొఫెసర్‌గా ఉద్యోగం సాధించిన తొలి ఆదివాసీ మహిళగా కూడా అనురాధకు గుర్తింపు దక్కింది.అనురాధ తండ్రి గుమ్మడి నర్సయ్య... ఇయన అంటే తెలియని వారు ఉండరు. సీపీఐ ఎంఎల్ పార్టీ విప్లవ రాజకీయాల్లో రాష్ట్ర నాయకుడిగా, ఇల్లెందు నియోజకవర్గం నుంచి 1983, 1985, 1989, 1999, 2004లో 5 పర్యాయాలు ఎమ్మెల్యేగా గెలిచారు. ఎలాంటి ఆర్భాటాలకు తావులేకుండా తన పదవీ కాలమంతా ప్రజల మధ్యనే గడిపారు నర్సయ్య. ఇప్పటికీ ఒక సామాన్య జీవితం గడుపుతున్నారు. ఇప్పటికీ ఆయన వ్యవసాయం మీదే ఆధాపడుతూ జీవనం గడుపుతున్నారు. నియోజకవర్గాల పునర్విభజనతో రెండుసార్లు ఓడిపోయారు. అయినా పార్టీని అంటిపెట్టుకుని, తాను నమ్మిన సిద్ధాంతాల కోసం పనిచేస్తూ ప్రజలతోనే జీవిస్తున్నారు. 25 ఏళ్లు ఎమ్మెల్యేగా చేసినప్పటికీ ఏనాడు కూడా అవినీతిని దరిచేరనివ్వని గొప్ప నాయకుడిగా నర్సయ్య పేరు పొందారు. ఈ నేపథ్యంలో నర్సయ్య కుమార్తె కావటమే కాకుండా... ప్రొఫెసర్ గా పని చేస్తున్న అనురాధతో బీఆర్ఎస్ చర్చలు జరిపినట్లు కూడా వార్తలు వచ్చాయి. ఆమె టికెట్ ఇచ్చి... ఇల్లందు నుంచి బరిలో ఉంచాలని భావించింది. ఈ మేరకు ఆమెతో చర్చలు జరిపినప్పటికీ... అనురాధ స్వతంత్రంగానే పోటీ చేసేందుకు సిద్ధమయ్యారు.గత ఎన్నికల్లో ఇక్కడ్నుంచి కాంగ్రెస్ తరపున బానోతు హరి ప్రియా నాయక్ ఎమ్మెల్యేగా గెలిచారు. అనంతరం ఆమె బీఆర్ఎస్ లో చేరారు. ప్రస్తుతం ఆమెకో మరోసారి టికెట్ కూడా ప్రకటించింది గులాబీ అధినాయకత్వం. ఇక కాంగ్రెస్ పార్టీ తరపున ఇంకా ఖరారు కావాల్సి ఉంది. ఇలాంటి నేపథ్యంలో... మాజీ ఎమ్మెల్యే నర్సయ్య కుమార్తె అయిన గుమ్మడి అనురాధ పోటీ ఇల్లందులో ఆసక్తికరంగా మారింది.

## ఖమ్మంలో హీటెక్కుతున్న పాలిటిక్స్

(మొదటిపేజీ తరువాయి)

పార్టీలో చేరడమన్నది తుమ్మల ఒంటరిగా తీసుకునే నిర్ణయం కాదని, ప్రజల కోరిక మేరకు ఆయన నిర్ణయం తీసుకోవాల్సిన ఉంటుందని పొంగులేటని అన్నారు. కాంగ్రెస్‌లో చేరాలని తనను ఆహ్వానించిన పొంగులేటి శ్రీనివాసరెడ్డికి మాజీ మంత్రి తుమ్మల ధన్యవాదాలు తెలిపారు. తన స్వార్థం, తన కుటుంబం కోసం తాను ఏనాడు పనిచేయలేదని స్పష్టం చేశారు. మంత్రిగా తాను ఖమ్మం జిల్లాను మిగిలిన అన్ని జిల్లాల కంటే మిన్నగా అభివృద్ధి చేశానని అన్నారు. కాంగ్రెస్‌లో చేరిక గురించి ఆయన ఒక్క మాట కూడా మాట్లాడలేదు. క్లుప్తంగా మాట్లాడిన తుమ్మల నాగేశ్వరరావు పార్టీ మార్పు గురించి కాని, తన మనస్సులో ఏముందోననే విషయం మాట మాత్రంగా కూడా ప్రస్తావించలేదు. అయితే తన రాజకీయ లక్ష్యం సీతారామ ప్రాజెక్టని తెలిపారు.

# కమలంలో.. అభ్యర్థుల కసరత్తు

(మొదటిపేజీ తరువాయి)

చేపట్టనున్నారు. జిల్లా, రాష్ట్ర, కేంద్ర పార్టీ స్థాయిలో స్క్రీనింగ్ చేపట్ట నున్నారు. ఆశావహుల నుంచి అప్లికేషన్లు తీసుకున్న తరువాత నియోజక వర్గాల వారీగా వచ్చిన అప్లికేషన్లను రాష్ట్ర నేతలు పరిశీలిస్తారు. ఇందుకోసం ప్రత్యేకంగా సీనియర్ నేతలతో కమిటీ ఏర్పాటు చేయనున్నారు. అనంతరం ఒక్కో నియోజక వర్గానికి ముగ్గురు పేర్లను ఫైనల్ చేసి హైకమాండ్ కు పంపిస్తారు. రంగారెడ్డి, హైదరాబాద్ తో పాటు ఉత్తర తెలంగాణ జిల్లాల నుంచి ఒక్కో సీటుకు భారీగా అప్లికేషన్లు వచ్చే అవకాశం ఉందని పార్టీ నేతలు అంచనా వేస్తున్నారు. పార్టీలో చేరికలు కూడా పెద్దగా లేకపోడంతో దరఖాస్తు చేసుకునే వారికే ఎక్కువగా అవకాశాలులభిస్తాయన్న అంచనా ఉంది. దరఖాస్తు ఫామ్‌లో టిక్కెట్ కోరుకునే అభ్యర్థులు తమపై ఉన్న క్రిమినల్ కేసుల వివరాలు కూడా వెల్లడించాలని కోరింది.

అభ్యర్థిపై క్రిమినల్ కేసుల వివరాలు, ఒకవేళ శిక్ష పడి ఉండే వాటి వివరాలు తెలపాలని కోరారు. పార్టీ ప్రాథమిక సభ్యత్వం నెంబర్‌తో పాటు ఏ సంవత్సరంలో పార్టీలో చేరారు, రాజకీయంగా చేపట్టిన కార్యక్రమాల వివరాలు ఏంటి? గతంలో ఎన్నికల్లో పోటీ చేస్తే వాటి వివరాలతో పాటు ఫలితాలు తెలపాల్సి ఉంటుంది. కాంగ్రెస్ పార్టీ అప్లికేషన్ కు యాభైవేల ఫీజు పెట్టింది. కానీ బీజేపీ అలాంటి ఫీజులేమీ పెట్టలేదని తెలుస్తోంది.

# స్లీప్ మోడ్‌లోకి చంద్రయాన్

(మొదటిపేజీ తరువాయి)

అసైన్‌మెంట్స్ అన్నీ కంప్లీట్ చేసినట్లుగా పేర్కొంది. ఈ మేరకు ఇస్రో ఎక్స్ లో ఓ పోస్ట్ చేసింది. "చంద్రయాన్-3 రోవర్ తన అసైన్‌మెంట్‌ను పూర్తి చేసింది. ఇది ఇప్పుడు పార్క్, స్లీప్ మోడ్‌లో సురక్షితంగా సెట్ చేశాం. పేలోడ్‌లు ఏపీఎక్స్ఎస్, ఎల్ఐబీఎస్ రెండూ టర్న్ ఆఫ్ చేశాం. ఈ పేలోడ్‌ల నుంచి డేటా ల్యాండర్ ద్వారా భూమికి ట్రాన్స్‌మిట్ అయింది. రోవర్ బ్యాటరీ ప్రస్తుతం పూర్తిగా ఛార్జ్ అయి ఉంది. రోవర్ సోలార్ ప్లేట్స్ ను తర్వాతి సన్ లైట్ వచ్చేలా సెట్ చేసి ఉంచాం. మళ్లీ సెప్టెంబర్ 22, 2023న సూర్యోదయం వచ్చినప్పుడు.. సూర్యరశ్మి సోలార్ ప్యానెల్‌లపై పడుతుంది. రిసీవర్ ఆన్‌లో ఉంచాము. వచ్చే సూర్యోదయానికి రోవర్ మళ్లీ అవేక్ అవుతుందని భావిస్తున్నాం" అని ఇస్రో ప్రకటించింది.చంద్రుడిపైకి పంపిన చంద్రయాన్-3 రోవర్, ల్యాండర్ సరిగ్గా పనిచేస్తున్నాయని ఇస్రో చీఫ్ ఎస్ సోమనాథ్ చెప్పారు. ల్యాండర్ 'విక్రమ్' రోవర్ 'ప్రజ్ఞాన్' ఇప్పటికీ పని చేస్తున్నాయని తమ మా బృందం ఇప్పుడు ఆ పరికరాలతో చాలా పని చేస్తోందని సోమనాథ్ చెప్పారు. "రోవర్ ల్యాండర్ నుంచి కనీసం 100 మీటర్ల దూరంలోకి పరిశోధనలు చేయడం గుడ్ న్యూస్. ఇక చంద్రుడిపై రాత్రి కాబోతోంది కాబట్టి, వాటిని డీయాక్టివేట్ చేసే ప్రక్రియను ఒకటి రెండు రోజుల్లో ప్రారంభించబోతున్నాం" అని సోమనాథ్ తెలిపారు. ఆగస్టు 23 సాయంత్రం 6.04 గంటలకు చంద్రయాన్-3 చంద్రుని ఉపరితలంపై సాఫ్ట్ ల్యాండింగ్ అయిన సంగతి తెలిసిందే.

**చంద్రుడి ఉపరితలంపై మరో చోట ల్యాండైన విక్రమ్ ల్యాండర్**

చంద్రయాన్-3 మిషన్ సూపర్ సక్సెస్‌ఫుల్‌గా కొనసాగుతోంది. తాజాగా విక్రమ్ ల్యాండర్‌ను మళ్లీ సాఫ్ట్ ల్యాండింగ్ చేశారు. చంద్రుడి ఉపరితలంపై మరో చోట విక్రమ్ ల్యాండైంది. దీనికి సంబంధించిన విషయాన్ని ఇస్రో ఇవాళ తన సోషల్ మీడియా అకౌంట్ ఎక్స్‌లో వెల్లడించింది. తాము ఇచ్చిన కమాండ్‌కు విక్రమ్ సక్రమంగా స్పందించినట్లు ఇస్రో చెప్పింది. ఆగస్టు 23వ తేదీన తొలిసారి చంద్రుడి దక్షిణ ధ్రువంపై విక్రమ్ ల్యాండైన విషయం తెలిసిందే. అయితే తాజాగా మిషన్ లక్ష్యంలో భాగంగా ఆ ల్యాండర్‌ను మరో చోట దించారు.

దీని కోసం నిర్వహించిన హాప్ ఎక్స్‌పరిమెంట్ విజయవంతం అయినట్లు ఇస్రో తెలిపింది.కమాండ్ ఇచ్చిన తర్వాత విక్రమ్ ల్యాండర్ ఇంజిన్లు ఫైర్ అయ్యాయని, ఆ తర్వాత ఆ ల్యాండర్ దాదాపు 40 సెంటీమీటర్ల మేరకు పైకి లేచి.. సుమారు 30 నుంచి 40 సెంటీమీటర్ల దూరంలో సురక్షితంగా ల్యాండ్ అయినట్లు ఇస్రో వెల్లడించింది. ఈ మిషన్‌కు చెందిన వీడియోను కూడా ఇస్రో తన ఎక్స్ అకౌంట్‌లో పోస్టు చేసింది. విక్రమ్ ల్యాండర్ చేపట్టిన ప్రయోగం చాలా కీలకమైందని ఇస్రో తెలిపింది. భవిష్యత్తులో చేపట్టబోయే ప్రయోగాలకు ఇది నాందిగా నిలుస్తుందని వెల్లడించింది. ఒకవేళ చంద్రుడి నుంచి మళ్లీ భూమ్మీదకు శ్యాంపిల్స్ తీసుకురావాలన్నా, లేక మానవుల తరలింపు ప్రక్రియ చేపట్టాలన్నా, ఇవాళ నిర్వహించిన ప్రయోగాం కీలకమైందని ఇస్రో తెలిపింది. విక్రమ్ ల్యాండర్‌కు చెందిన అన్ని సిస్టమ్స్ నార్మల్‌గా పనిచేస్తున్నట్లు ఇస్రో పేర్కొన్నది. ర్యాంప్‌ను మోహరించామని, చేస్ట్, ఐఎల్ఎస్ఏ పరికరాలు ఫోల్డ్ అయ్యాయని, పరీక్ష పూర్తి అయిన తర్వాత అవి మళ్లీ యధావిధిగా తమ పని చేస్తున్నట్లు ఇస్రో చెప్పింది.

# 16, 17 తేదీల్లో సీడబ్ల్యూసీ

(మొదటిపేజీ తరువాయి)

సమావేశం ఇదే కానుంది. ఈ సమావేశం హైదరాబాద్‌లో జరపాలని తెలంగాణ పీసీసీ ప్రతిపాదించింది. సమావేశంతో రాష్ట్ర కాంగ్రెస్ లో జోష్ వస్తుందని భావిస్తోంది. దీనికి అధిష్ఠానం ఒప్పుకుంది. సోనియా గాంధీ, రాహుల్ గాంధీ, ఏఐసీసీ అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గే, ప్రియాంకాగాంధీతో పాటు కాంగ్రెస్ పాలిత రాష్ట్రాల ముఖ్యమంత్రులు సహా 39 మంది వర్కింగ్ కమిటీ సభ్యులు ఈ సమావేశం కోసం రాష్ట్రానికి రానున్నారు. అగ్రనేతల రాకతో తెలంగాణ కాంగ్రెస్ లో జోష్ రానుంది. సీడబ్ల్యూసీ సమావేశం చివరి రోజు సెప్టెంబరు 17న హైదరాబాద్ సంస్థానం భారతదేశంలో విలీనమైన రోజు కావడంతో ఆ వేడుకల్లో సోనియాగాంధీ ముఖ్య అతిథిగా పాల్గొననున్నారు. ఈ సమావేశాలతో తెలంగాణలో కాంగ్రెస్ పార్టీ ఎన్నికల సైరన్ మోగించనుంది. పదహారో తేదీన సిడబ్ల్యూసీ ప్రతినిధుల సమావేశం జరుగుతుందని కాంగ్రెస్ నేత కేసీ వేముగోపాల్ ప్రకటించారు. పదిహేడో తేదీన సీడబ్ల్యూసీ సభ్యులు, పీసీసీ ప్రెసిడెంట్లు, సీఎల్పీ నేతలు సమావేశం అవుతారు. 17వ తేదీన మెగా ర్యాలీలో చేపడతామన్నారు. ఈ ర్యాలీలో ఐదు డిక్లరేషన్లను ప్రకటించనున్నారు. పద్దెనిమిదో తేదీన బీఆర్ఎస్ ప్రభుత్వంపై చార్జిషీటు విడుదల చేస్తామని వేణుగోపాల్ ప్రకటించారు. అభ్యర్థుల జాబితాను కూడా అప్పటికల్లా ఖరారు చేసే అవకాశం ఉంది. మొత్తం 100 మందికి పైగా వివిధ రాష్ట్రాల కాంగ్రెస్ ముఖ్య నేతలు తెలంగాణవ్యాప్తంగా పర్యటిస్తారని ఆ పార్టీ వర్గాలు చెబుతున్నాయి. అక్టోబరు 2 నుంచి టీపీసీసీ బస్సు యాత్ర చేపట్టింది. ఈ నెల రోజుల పాటు జరిగే ఈ యాత్రలో టీపీసీసీ అధ్యక్షుడు రేవంత్‌రెడ్డి, భట్టి విక్రమార్క, టి.జీవన్‌రెడ్డి, కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి, ఉత్తమ్ కుమార్‌రెడ్డి, పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి తదితర కీలక నేతలంతా పాల్గొననున్నారు. తెలంగాణలో అధికారం చేపట్టాలని కాంగ్రెస్ పార్టీ పట్టుదలగా ఉంది. సీడబ్ల్యూసీ భేటీ తర్వాత అభ్యర్థులను కూడా ప్రకటించే అవకాశం ఉంది. ఇప్పటికే పూర్తి స్థాయిలో అభ్యర్థుల ఎంపిక కసరత్తు నిర్వహిస్తున్నారు. స్క్రీనింగ్ కమిటీ సమావేశాలు జరుగుతున్నాయి. లిస్ట్ అంతా ప్రిపేర్ చేసిన తర్వాత .. హైకమాండ్ ఆమోదంతో తుది ప్రకటన వచ్చే అవకాశం ఉంది.

# విదేశాలలో విద్యను అభ్యసించే స్థాయికి ప్రభుత్వ పాఠశాలలు

**మంత్రి సబితా ఇంద్రారెడ్డి**

హైదరాబాద్ - ప్రభాత సూర్యుడు

విదేశాలలో విద్యను అభ్యసించే స్థాయికి ప్రభుత్వ పాఠశాలల విద్యార్థులను తీర్చిదిద్దుతామని మంత్రులు సబితా ఇంద్రారెడ్డి, తలసాని శ్రీనివాస్ యాదవ్ అన్నారు. సనత్‌నగర్‌లో 2.22 కోట్ల రూపాయల వ్యయంతో చేపట్టనున్న అభివృద్ధి పనులు, బన్సీలాల్ పేటలోని ప్రభుత్వ పాఠశాలలో 1.84 కోట్ల రూపాయల వ్యయంతో చేపట్టనున్న అదనపు తరగతి గదుల నిర్మాణ పనులను మంత్రులు ప్రారంభించారు.వచ్చే విద్యా సంవత్సరం నుంచి మేకల మండి పాఠశాలను హై స్కూల్‌గా అప్ గ్రేడ్ చేస్తున్నట్లు విద్యా శాఖ మంత్రి సబిత ప్రకటించారు. ముఖ్యమంత్రి కేసీఆర్ ఆదేశాల మేరకు పేద విద్యార్థులు అధికంగా విద్యను అభ్యసించే ప్రభుత్వ పాఠశాలల్లో మన బస్తీ -మన బడి కార్యక్రమంతో అన్ని ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థులకు అన్ని సౌకర్యాలు, వసతులు కల్పిస్తున్నామని స్పష్టం చేశారు.తెలంగాణ రాష్ట్రం వచ్చిన తర్వాత సన్నబియ్యంతో నాణ్యమైన భోజనం, వారానికి 3 రోజులు రాగి జావా అందిస్తున్నామని గుర్తు చేశారు. విద్యారంగ అభివృద్ధికి ప్రభుత్వం ఎంతో కృషి చేస్తున్నదని చెప్పారు. ఈ కార్యక్రమంలో స్థానిక ప్రజాప్రతినిధులు, అధికారులు పాల్గొన్నారు.




# కాంగ్రెస్‌లో అంతా సీక్రెట్

(మొదటిపేజీ తరువాయి)

టీపీసీసీ చీఫ్ రేవంత్ రెడ్డి అధ్యక్షతన సమావేశమైన ప్రదేశ్ ఎలక్షన్ కమిటీ 1006 దరఖాస్తులను పరిశీలించింది. అభ్యర్థుల ఎంపికకు సంబంధించి విధివిధానాలను ఈ సమావేశంలో చర్చించారు. నియోజకవర్గాల వారీగా ఎంతమంది దరఖాస్తు చేసుకున్నారో జాబితాను రెడీ చేశారు. నియోజకవర్గాల వారీగా అర్జీలను వేర్వేరుగా పరిశీలించారు. అలాగే బీసీలకు సంబంధించి వచ్చిన దరఖాస్తుల సంఖ్యను కూడా నియోజకవర్గాల వారీగా వేరు చేసి పరిశీలించారు. దరఖాస్తుదారుడి పేరు? ఎప్పటి నుంచి పార్టీలో ఉంటున్నారు? ఏ హోదాలో ఉన్నారు? పుట్టిన తేదీ, కులం, ఉప కులాలు వివిధ రకాల సమాచారంతో కూడిన 500పేజీల ఈ బుక్‌లెట్‌ను పీఈసీ సభ్యులకు అందజేశారు. ఈ వివరాల ఆధారంగా ఒక్కో నియోజకవర్గానికి రెండు, లేక మూడు పేర్లు సూచిస్తూ వెయ్యి మంది నుంచి రెండు మూడు వందల మందికి కుదించి జాబితా సిద్ధం చేశారు.ఇప్పటికే 35 నుంచి 40 నియోజకవర్గాల్లో అభ్యర్థులపై క్లారిటీ వచ్చిందని సమాచారం. మిగతా నియోజకవర్గాల్లో అభ్యర్థుల ఎంపికపై ప్రదేశ్ ఎలక్షన్ కమిటీ (పీఈసీ) ఫోకస్ పెట్టినట్లు తెలుస్తోంది. పీఈసీ సభ్యులతో ఇవాళ స్క్రీనింగ్ కమిటీ సమావేశమై ఆ సీల్డ్ కవర్‌ను పరిశీలిస్తుంది. వాళ్ల నుంచి ఆయా అభ్యర్థుల ఎంపికకు గల కారణాలను స్క్రీనింగ్ కమిటీ అడిగి తెలుసుకోనుంది. పార్టీకి ఆయా నియోజకవర్గాల్లో బలం ఎంత ఉంది? అభ్యర్థితో పార్టీకి కలిసి వచ్చే అదనపు అంశాలపై కాంగ్రెస్ సర్వే చేయనుంది.అయితే సిట్టింగ్ ఎమ్మెల్యేలు, ఎంపీలు, ఎమ్మెల్సీలు, ఏఐసీసీలు కార్యదర్శులు, సీనియర్ నాయకులు పోటీ చేయనున్న వివాదరహిత నియోజకవర్గాల్లో సింగిల్ నేమ్‌తో ఉండే 40కి పైగా నియోజక వర్గాల అభ్యర్థులను ప్రదేశ్ కాంగ్రెస్ కమిటీ స్థాయిలోనే ఎంపిక అవుతారని కాంగ్రెస్ వర్గాలు చెబుతున్నాయి. మిగిలిన నియోజకవర్గాల దరఖాస్తులను మరింత లోతైన అధ్యయనం చేసి ఎంపిక చేస్తారని పేర్కొంటున్నాయి. సర్వేలతోపాటు సామాజిక, రాజకీయ పరిస్థితులు స్థానిక సమీకరణాలు ఇలా అన్ని కోణాల్లో పరిశీలన చేసి లాబీయింగ్‌కు తావు లేకుండా అభ్యర్థుల ఎంపిక ఉంటుందని నేతలు చెబుతున్నారు.

## హైదరాబాద్‌లో వానలే... వానలు

(మొదటిపేజీ తరువాయి)

లేక లక్ష్మి ఇబ్బందులు పడుతోంది. అయితే ఆమె కనిపించకుండా పోయింది. ఇంటి వద్ద పగిలిన గాజులు కనిపించడంతో.. నాలాలో పడిపోయినట్లు కుటుంబ సభ్యుల అనుమానం వ్యక్తం చేస్తున్నారు.లక్ష్మి ఇంట్లో గ్యాస్ స్టవ్‌పై వంట చేస్తోంది. బియ్యం గిన్నె స్టవ్‌పై ఉంది. అలానే సెల్ ఫోన్ చార్జింగ్ పెట్టి ఉండడం, అక్కడే చెప్పులు కూడా ఉండడంతో.. ఆమె హుస్సేన్ సాగర్ నాలాలో పడిపోయి నట్లు కుటుంబ సభ్యులు అనుమానం వ్యక్తం చేస్తున్నారు. గాంధీనగర్ పోలీసులకు లక్ష్మి కుమార్తె సునీత ఫిర్యాదు చేసింది. కేసు నమోదు చేసుకున్న పోలీసులు లక్ష్మి కోసం గాలింపులు చేపట్టారు.'మా అమ్మ హుస్సేన్ సాగర్ నాలాలో పడి గల్లంతయింది. నిన్న మధ్యాహ్నం 2 గంటల నుంచి కనిపించకుండాపోయింది. మా అమ్మ ఆచూకీ కోసం గాంధీనగర్ పీఎస్‌లో ఫిర్యాదు చేసాము. మిస్సింగ్ కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నమని పోలీసులు చెప్పారు. మా కిచెన్ ప్రహరీ వద్ద పగిలిన గాజులు కనిపించడంతో అమ్మ నాలాలో పడిపోయినట్లు అనుమానంగా ఉంది. రిటేయినింగ్ వాల్ లేక ఇబ్బందులు పడుతున్నాము. గత రెండు సంవత్సరాలుగా ఇంటికి టాయిలెట్ లేక మా అమ్మ ఇబ్బందులు పడుతుంది. మాకు వివాహం అవడంతో ఇంట్లో అమ్మ ఒంటరిగా ఉంటోంది. అధికారులు, పోలీసులు స్పందించి మా అమ్మ ఆచూకీ తెలపాలని వేడుకుంటున్నాం' అని అన్నారు.మహిళ గల్లంతు అనే వార్తతో అధికార యంత్రాంగం, పోలీసులు హుటాహుటిన లక్ష్మి ఇంటికి చేరుకుని కుటుంబ సభ్యులను అడిగి వివరాలు తెలుసుకుంటున్నారు. మహిళ ఆచూకీ కోసం ముడు ఢీఆర్ఎఫ్ బృందాలు నాలా రూట్ మ్యాప్ చూస్తూ గాలిస్తున్నాయి.

**అన్ని జిల్లాలకు ఆరెంజ్ అలెర్ట్**

చాలా కాలం పాటు జాడ లేకుండా పోయిన వర్షాలు మళ్లీ దంచికొడుతున్నాయి.. హైదరాబాద్ సహా తెలంగాణ వ్యాప్తంగా ముఖ్యంగా మెదక్, నిజామాబాద్, ఆదిలాబాద్, వరంగల్ ఉమ్మడి జిల్లాల్లో భారీ వర్షాలు కురుస్తున్నాయి.. మరోవైపు.. ఆంధ్రప్రదేశ్‌లో భారీ వర్షాలు కురుస్తున్నాయి.. అయితే, తెలంగాణ రాష్ట్రంలో రాబోయే ఐదు రోజుల పాటు మోస్తారు నుంచి భారీ వర్షాలు కురుస్తాయని హైదరాబాద్ వాతావరణ కేంద్రం తాజాగా ప్రకటించింది.. పశ్చిమ మధ్య బంగాళాఖాతంలో ఉపరితల ఆవర్తనం కొనసాగుతుండగా.. ఈశ్యాన మధ్య బంగాళాఖాతంలో ద్రోణి ఏర్పడింది.. ఉపరితల ఆవర్తనం.. ద్రోణి ప్రభావంతో రాష్ట్రంలో మోస్తారు నుంచి భారీ వర్షాలు కురిసే అవకాశం ఉందని అంచనా వేసింది. కొన్ని చోట్ల ఉరుములు మెరుపులతో కూడిన వర్షపాతం నమోదయ్యే అవకాశం ఉండగా.. హైదరాబాద్ పరిసర జిల్లాలు మినహా మిగతా జిల్లాలకు ఆరెంజ్ అలెర్ట్ జారీ చేసింది.. ఉత్తర, ఈశ్యాన జిల్లాల్లో భారీ నుంచి అతి భారీ వర్షాలు కురిసే అవకాశం ఉందని పేర్కొంది.మరోవైపు ఆంధ్రప్రదేశ్‌లో వర్షాలు దంచికొడుతున్నాయి.. వాయువ్య బంగాళాఖాతంలో ఉపరితల ఆవర్తనం బలపడుతోందని.. ఉత్తర కోస్తా నుంచి తెలంగాణ వరకు ద్రోణి విస్తరించి ఉందని.. వచ్చే నాలుగు రోజుల పాటు తెలంగాణతో పాటు ఆంధ్రప్రదేశ్ లో మోస్తరు నుంచి భారీ వర్షాలు కురుస్తాయని వెల్లడించింది.


## సంపాదకీయం

# స్టాలిన్ వ్యాఖ్యలతో అస్త్రం..శస్త్రం

రాజకీయాల్లో మాటలే తూటాలుగా మారుతుంటాయి. వ్యాఖ్యలే అస్త్రాలవుతాయి. సమాజంపై తీవ్ర ప్రభావాన్ని చూపి రాజకీయ పార్టీల భవిష్యత్తును నిర్దేశిస్తుంటాయి. ఒక్క మాట.. సమాజంలో కోట్లాది మందిని ప్రభావితం చేస్తుంది. ద్రవిడ మున్నేట్ర కళగం (డీఎంకే) నేత ఉదయనిధి స్టాలిన్ చేసిన వ్యాఖ్యలు దేశ రాజకీయాల్లో ప్రకంపనాలు సృష్టిస్తున్నాయి. దేశంలో అత్యధిక సంఖ్యలో ఉన్న హిందువుల మనోభావాలను గాయపరిచేలా ఆయన చేసిన వ్యాఖ్యలను అధికారపక్షం ఆయుధంగా మలచుకుంది. ఏకంగా ప్రధాని తర్వాత అత్యంత శక్తివంతమైన నేతగా పేరున్న కేంద్ర హోంమంత్రి అమిత్ షా స్వయంగా రంగంలోకి దిగి ఉదయనిధిపై కౌంటర్ అటాక్ మొదలుపెట్టారు. దాంతో దేశవ్యాప్తంగా కమలనాథులు విమర్శనాస్త్రాలతో విరుచుకుపడుతున్నారు. దేశంలోని 28 రాజకీయ పార్టీలను ఒక గొడుగు తెస్తూ ఏర్పాటు చేసిన కూటమి లో ప్రకంపనాలు మొదలయ్యాయి. ఈ వ్యాఖ్యలు తమిళనాడులో డీఎంకేకు నష్టం చేస్తాయా లేక ప్రయోజనం కల్గిస్తాయా అన్న విషయం పక్కనపెడితే.. కూటమిలోని ఇతర పార్టీలకు ఇతర రాష్ట్రాల్లో కచ్చితంగా నష్టాన్ని కల్గిస్తాయన్న ఆందోళన నేతల్లో వ్యక్తమవుతోంది.తమిళనాడు ముఖ్యమంత్రి ఎంకే స్టాలిన్ కుమారుడు, సినీ నటుడిగా పేరొంది ప్రస్తుతం రాష్ట్ర ప్రభుత్వంలో మంత్రిగా ఉన్న ఉదయనిధి స్టాలిన్ చేసిన వ్యాఖ్యలు దేశవ్యాప్తంగా తీవ్ర కలకలం సృష్టిస్తున్నాయి. అవి యావత్ హిందూ సమాజాన్ని గాయపరిచేలా ఉన్నాయి. "మనం నిర్మూలించాల్సిన విషయాలు కొన్ని ఉన్నాయి. దోమలు, డెంగ్యూ జ్వరం, మలేరియా, కరోనా వంటి వాటిని కేవలం వ్యతిరేకిస్తే సరిపోదు. పూర్తిగా నిర్మూలించాల్సిందే. సనాతన ధర్మం కూడా అలాంటిదే. కేవలం వ్యతిరేకిస్తే సరిపోదు. సనాతన ధర్మాన్ని నిర్మూలించడమే మన మొదటి కర్తవ్యం కావాలి" అంటూ ఆయన చేసిన వ్యాఖ్యలు హిందూ మతంపై కరడుగట్టిన ద్వేషాన్ని బయటపెట్టాయి. దేశంలోని మెజారిటీ ప్రజానీకం అనుసరిస్తున్న మతవిశ్వాసాలను, ధర్మాన్ని నిర్మూలించాలని కోరుకుంటున్నారు. హిందూమతాన్ని, సనాతన ధర్మాన్ని ద్వేషించే ద్రవిడ మున్నేట్ర కళగం చరిత్ర రహస్యమేమీ కాదు. తమిళనాట బ్రాహ్మణ ఆధిపత్య ధోరణిని ప్రశ్నిస్తూ మొదలైన ద్రవిడ ఉద్యమం నుంచి పుట్టిన రాజకీయ పార్టీలే డీఎంకే, అన్నాడీఎంకేలు. మూల సిద్ధాంతం ఆధిపత్యాన్ని ప్రశ్నించడమే అయినప్పటికీ కాలక్రమంలో అది బ్రాహ్మణ ద్వేషంగా.. అటుపై హిందూ మత ద్వేషంగా మారిపోయింది. నాస్తిక భావజాలాన్ని ఎవరూ తప్పుబట్టకపోయినా.. కోట్లాది ప్రజల విశ్వాసాలను గేలి చేయడం, ఎగతాళి చేయడాన్ని మాత్రం తప్పుబట్టక తప్పదు. గతంలో డీఎంకే కు చెందిన ప్రముఖ నేత కనిమొళి కోట్లాది ప్రజలు ఆరాధ్య దైవం వెంకటేశ్వరస్వామిపై వివాదాస్పద వ్యాఖ్యలు చేశారు. పేదవాడిని కాపాడలేని దేవుడు మనకెందుకు అంటూ ఆమె చేసిన వ్యాఖ్యలు అప్పట్లో తీవ్ర దుమారం రేపాయి. ఆ పార్టీ నేతలు అనేక సందర్భాల్లో, అనేక వేదికలపై హిందూ మతంపై ద్వేషాన్ని ప్రదర్శిస్తూనే వచ్చారు. దశాబ్దాలుగా ద్రవిడ వాదం ముసుగులో ఈ పార్టీ భారతదేశంలోని అతిపెద్ద మతంపై బహిరంగంగా ద్వేషాన్ని వెదజల్లుతోంది.ఉదయనిధి స్టాలిన్ ద్వేషపూరిత వ్యాఖ్యలను తప్పుబడుతూ కేంద్ర హోంమంత్రి అమిత్ షా ప్రతిదాడి మొదలుపెట్టారు. జైపూర్‌లో ఓ ఎన్నికల సభలో ప్రసంగించిన ఆయన.. కేవలం ఉదయనిధి లేదా డీఎంకేను మాత్రమే లక్ష్యంగా చేసుకోలేదు. మొత్తం విపక్ష కూటమిని టార్గెట్ చేస్తూ విమర్శనాస్త్రాలు సంధించారు. ఓట్ల కోసం సనాతన ధర్మాన్నే అవహేళన చేస్తారా అంటూ మండిపడ్డారు. ఉదయనిధి వ్యాఖ్యలు ఆయన పార్టీకో, తమిళనాడు రాష్ట్రానికో మాత్రమే పరిమితం కాదని, అవి మొత్తం విపక్ష కూటమి తరఫునే మాట్లాడారని అన్నారు. ఇది కచ్చితంగా మారణహోమాన్ని సృష్టించి హిందువులను అంతం చేయాలన్న ప్రయత్నమే అని సూత్రీకరించారు. డీఎంకే, కాంగ్రెస్ పార్టీలు భారతదేశ వారసత్వాన్ని, సనాతన ధర్మాన్ని కించపరుస్తున్నారని అమిత్ షా అన్నారు. 2010లో కాంగ్రెస్ నేత రాహుల్ గాంధీ చేసిన వ్యాఖ్యలను కూడా ఆయన గుర్తుచేశారు. హిందుత్వ సంస్థలను ఉగ్రవాద సంస్థ లష్కర్-ఏ-తోయిబాతో పోలుస్తూ వాటికంటే భయంకరమైనవి అని రాహుల్ గాంధీ అన్నారు. అలాగే సుశీల్ కుమార్ షిండే చేసిన హిందూ టెర్రర్ వ్యాఖ్యలను కూడా ఉదహరించారు. సనాతన ధర్మం దేశ ప్రజల హృదయాలను శాసిస్తోందని, మోదీ మళ్లీ గెలిస్తే దేశంలో సనాతన పాలన కొనసాగుతుందని అన్నారు. "చూస్తూ ఉండండి.. సనాతన ధర్మమే మళ్లీ గెలుస్తుంది" అంటూ వ్యాఖ్యానించారు.భారతీయ జనతా పార్టీని, దాని సైద్ధాంతిక మాతృసంస్థ 'రాష్ట్రీయ స్వయం సేవక్'ను కాంగ్రెస్, కమ్యూనిస్టులు సహా దేశంలో అనేక రాజకీయ పార్టీలు విమర్శిస్తూ ఉంటాయి. హిందుత్వం పేరుతో బీజేపీ, ఆరెస్సెస్ దేశంలో విద్వేషాన్ని సృష్టిస్తున్నాయని, సమాజంలో విభజన తీసుకొస్తున్నాయని దుయ్యబడుతూ ఉంటాయి. కానీ నేరుగా హిందూమత విశ్వాసాలు, సనాతన ధర్మం జోలికి వెళ్లవు. అయితే డీఎంకే నేతలు అలా కాదు. వారు నేరుగా హిందూ ధర్మం, మత విశ్వాసాలుపై నేరుగా దాడికి దిగుతుంటారు. ద్రవిడ పార్టీల సైద్ధాంతిక భావజాలం ఉన్న తమిళనాట వారికి ఓట్లు తెచ్చిపెట్టొచ్చు. లేదా కొన్ని వర్గాలను దూరం చేస్తూ ఉండొచ్చు. కానీ మిగతా రాష్ట్రాలు అలా కాదు. అదే ఇప్పుడు విపక్ష కూటమిలో పెద్ద సమస్యగా మారింది. ఉదయనిధి స్టాలిన్ వ్యాఖ్యలను కూటమిలోని ఇతర పార్టీలేవీ సమర్థించకపోవచ్చు. కానీ ఆ వ్యాఖ్యల ప్రభావాన్ని మాత్రం ఎదుర్కోక తప్పదు. ఇంత హిందూ ద్వేషాన్ని హిందూ సమాజంలో ఎవరూ అంగీకరించరు. బీజేపీని, ప్రధాన మంత్రి నరేంద్ర మోదీని అధికారం నుంచి గద్దె దించాలన్న లక్ష్యంతో సిద్ధాంతాలను, రాజకీయ విభేధాలను పక్కనపెట్టి ఒక వేదిక మీదకు వచ్చిన రాజకీయ పార్టీలు ఉమ్మడిగా ప్రయోజనం పొందాలని ఎలాగైతే భావిస్తున్నాయో.. కూటమిలో ఒక పార్టీ చేసే తప్పిదాల కారణంగా నష్టాలను సైతం ఉమ్మడిగా ఎదుర్కోక తప్పదు. విపక్ష కూటమిలో ఇప్పుడు ఇదే అంతర్మథనం జరుగుతోంది. ఉదయనిధి వ్యాఖ్యలను తప్పుపట్టకపోతే నష్టపోతామని పలువురు నేతలు అభిప్రాయపడుతున్నారు. ఇప్పటి వరకు నేరుగా ఎవరూ స్పందించకపోయినా.. తదుపరి కూటమి సమావేశంలో ఇదే అంశం ప్రధాన చర్చనీయాంశంగా మారనుంది.కొసమెరుపు ఏంటంటే.. అమిత్ షా కౌంటర్ అటాక్ తర్వాత కూడా ఉదయనిధి మళ్లీ మాట్లాడారు. తాను చెప్పినదాంట్లో తప్పేమీ లేదని, ఒక్క మాట కూడా వెనక్కి తీసుకునే ప్రసక్తే లేదని తేల్చి చెప్పారు. సనాతన ధర్మాన్ని నిర్మూలించడం అంటే మానవత్వాన్ని కాపాడడం, సమానత్వాన్ని నెలకొల్పడమేనని అర్థం చెప్పారు. సనాతన ధర్మం కారణంగా అణచివేతకు గురైన వర్గాల తరఫునే తాను ఈ వ్యాఖ్యలు చేశానని చెప్పుకొచ్చారు. ఉదయనిధి వ్యాఖ్యలను తండ్రి స్టాలిన్ కూడా సమర్థించారు. దీంతో ఇప్పుడు ప్రతిపక్ష నేతలు ఎలా స్పందించాలో తెలియక జుట్టు పీక్కుంటున్నాయి.

# ఉపాధ్యాయ వృత్తికే వన్నె తెచ్చిన మహా మనిషి సర్వేపల్లి రాధాకృష్ణన్

### నేడు ఆయన జయంతి (ఉపాధ్యయ దినోత్సవం)



వృత్తి రీత్యా, వ్యక్తిత్వ రీత్యా, సంస్కార రీత్యా సర్వేపల్లి మహోన్నతుడు. పువ్వ పుట్టగానే పరిమళిస్తుందన్నట్టు చిన్నతనం నుంచి అసాధారణ ప్రజ్ఞా పాటవాలను ప్రదర్శించిన డాక్టర్ సర్వేపల్లి.. స్వశక్తితో ఉన్నత శిఖరాలకు ఎదిగి పలువురికి మార్గదర్శకంగా, తన వృత్తి ధర్మానికి మకుటంగా వెలిగారు. గురువులకే గురువుగా ఉపాధ్యాయవృత్తికే ఆదర్శంగా నిలిచారు ఆయన..సర్వేపల్లి రాధాకృష్ణన్ సెప్టెంబర్ 5, 1888 జన్మించి? ఏప్రిల్ 17, 1975 మరణించారు. భారతదేశపు మొట్టమొదటి ఉపరాష్ట్రపతి మరియు రెండవ రాష్ట్రపతి కూడా. అంతేకాదు భారతీయ తాత్వికచింతనలో పాశ్చాత్య తత్వాన్ని ప్రవేశ పెట్టినాడని ప్రతీతి. రెండు పర్యాయాలు ఉపరాష్ట్రపతి పదవి చేపట్టి, తరువాత రాష్ట్రపతిగా ఒక పర్యాయం పదవిని చేపట్టి, భారతదేశపు అత్యంత క్లిష్టకాలంలో(చైనా, పాకిస్తానులతో యుద్ధ సమయం) ప్రధానులకు మార్గనిర్దేశం చేశారు.సర్వేపల్లి రాధాకృష్ణన్ 5-9-1888న మద్రాసుకు ఈశాన్యంగా 64 కి.మీల దూరమున ఉన్న తిరుత్తణిలో సర్వేపల్లి వీరస్వామి, సీతమ్మ దంపతులకు జన్మించాడు. వారి మాతృభాష తెలుగు. సర్వేపల్లి బాల్యము, విద్యాభ్యాసము ఎక్కువగా తిరుత్తణి మరియు తిరుపతిలోనే గడిచిపోయాయి. ప్రాథమిక విద్య తిరుత్తణిలో సాగింది. తిరుపతి, నెల్లూరు, మద్రాసు క్రిస్టియన్ కాలేజీ మున్నగుచోట్ల చదివి ఎం.ఏ పట్టా పొందాడు. బాల్యం నుండి అసాధారణమైన తెలివితేటలు కలవాడాయాన. 1906లో 18 సంవత్సరాల చిరుప్రాయంలో శివకామమ్మతో వివాహము జరిగింది. వీరికి ఐదుగురు కూతుళ్ళు, ఒక కుమారుడు కలిగారు.వీళ్లది చాలాపేద కుటుంబం. ఉన్నత విద్య చదివించే స్తోమత లేదని తండ్రి వీరాస్వామి కొడుకును పూజారిగా చేయమన్నారు. కానీ రాధాకృష్ణన్‌కు చదువంటే ప్రాణం. అందుకే ఉన్నత పాఠశాల చదువుకోసం తిరుపతిలోని మిషనరీ పాఠశాలలో చేరారు. ఇక అప్పటినుంచీ ఈయన చదువంతా ఉపకారవేతనాలతోనే సాగిపోయింది. భోజనం చేసేందుకు అరిటాకు కూడా కొనలేని పరిస్థితుల్లో ఆయన నేలను శుభ్రపరచుకొని భోజనం చేసిన సందర్భాలు కూడా ఉన్నాయి.మద్రాసు క్రిస్టియన్ కళాశాలలో తత్వశాస్త్రంలో ఎమ్మే పూర్తిచేసిన రాధాకృష్ణన్ ఇరవై ఏళ్ల వయసులోనే మద్రాసు ప్రెసిడెన్సీ కాలేజీలో బోధకుడిగా చేరారు. ఆయన పాఠం చెప్పే తీరు విద్యార్థుల్లో ఎంతో ఆసక్తి కలిగించేది. ఆయన రోజులో 12 గంటలపాటు పుస్తకాలు చదువుతూనే ఉండేవారు. ఎన్నో విలువైన వ్యాసాలు, పరిశోధన పత్రాలను రాసేవారు.

రాధాకృష్ణన్ మైసూర్ విశ్వవిద్యాలయం, కోల్‌కతా విశ్వవిద్యాలయాల్లో ప్రొఫెసర్ పదవులు చేపట్టడమే కాదు, ఆంధ్రా యూనివర్సిటీ, బెనారస్ హిందూ విశ్వవిద్యాలయాల్లో ఉపకులపతి (వైస్‌ఛాన్స్‌లర్) గా పనిచేశారు. రష్యాలో భారత రాయబారిగా కూడా పనిచేశారు.ఆయన రాసిన 'ఇండియన్ ఫిలాసఫీ' పుస్తకం ప్రపంచవ్యాప్తంగా గుర్తింపు పొందింది. ప్రత్యేక ఆహ్వానంపై ఆక్స్‌ఫర్డ్ యూనివర్సిటీలో ప్రసంగించారు. 'యూనివర్సిటీ ఎడ్యుకేషన్ కమిషన్'లో సభ్యుడిగా ఉండి మన విద్యా వ్యవస్థ అభివృద్ధికి ఎన్నో విలువైన సలహాలు, సూచనలు ఇచ్చారు రాధాకృష్ణన్. 1952లో మన మొదటి ఉపరాష్ట్రపతిగా, 1962లో భారత రెండో రాష్ట్రపతిగా అత్యున్నత పదవులు చేపట్టారు. 1954లో భారతరత్న పురస్కారం దక్కింది. అయినా ఏనాడూ ఆడంబరాలకు పోలేదు.రాష్ట్రపతిగా ఉన్నప్పుడు వచ్చే వేతనంలో కేవలం 25 శాతం తీసుకుని మిగతాది ప్రధాన మంత్రి సహాయ నిధికి తిరిగిచ్చేవారు.రాధాకృష్ణన్ ఉపాధ్యాయ వృత్తిలో ఉన్నప్పుడు విద్యార్థులకు శ్రద్ధగా బోధించడమే కాదు, వారిపై ప్రేమాభిమానాలు చూపేవారు. ఆయన మైసూరు నుంచి కలకత్తాకు ప్రొఫెసర్‌గా వెళ్లేప్పుడు గుర్రపు బండిని పూలతో అలంకరించి తమ గురువును కూర్చోబెట్టి రైల్వేస్టేషన్ వరకు విద్యార్థులే లాక్కుంటూ వెళ్లారట.రాధాకృష్ణన్ రాష్ట్రపతిగా ఉన్నప్పుడు ఆయన శిష్యులు, అభిమానులు పుట్టినరోజును ఘనంగా చేస్తామని కోరగా, దానికి బదులు ఆ రోజును ఉపాధ్యాయ దినోత్సవంగా చేయాలని ఆయన కోరారట. ఆరోజు నుంచే ఆయన పుట్టినరోజును ఉపాధ్యాయ దినోత్సవంగా జరుపుకోవడం ఆనవాయితీగా మారింది.

# వ్యవసాయ ఆధారిత పరిశ్రమలదే భవిష్యత్తు

### వ్యవసాయ శాఖా మంత్రి సింగిరెడ్డి నిరంజన్ రెడ్డి

హైదరాబాద్ - ప్రభాత సూర్యుడు

వ్యవసాయ ఆధారిత పరిశ్రమలదే భవిష్యత్తు అని, రైతుకు గిట్టుబాటు ధర లభించేందుకు ప్రభుత్వం ఫుడ్ ప్రాసెసింగ్ యూనిట్ల ఏర్పాటును ప్రోత్సహిస్తున్నదని వ్యవసాయ శాఖా మంత్రి సింగిరెడ్డి నిరంజన్ రెడ్డి అన్నారు. సోమవారం పెబ్బేరు మండలకేంద్రంలో శ్రీ సాయి రైస్ ఇండస్ట్రీని ప్రారంభించిన అనంతరం ఆయన మాట్లాడారు. తెలంగాణ వ్యాప్తంగా ఫుడ్ ప్రాసెసింగ్ యూనిట్ల ఏర్పాటుకు ప్రభుత్వం పది వేల ఎకరాలను కేటాయించింది.బీఆర్ఎస్ ప్రభుత్వం రైతుబంధు, రైతుబీమా, రుణమాఫీ, ఉచిత కరంటు, సాగునీళ్లు అందించి వంద శాతం పంటల కొనుగోళ్లు చేసి రైతుకు అండగా నిలుస్తున్నదని స్పష్టం చేశారు. దేశ చరిత్రలో రెండు సార్లు రుణమాఫీ చేసిన ఏకైక రాష్ట్రం తెలంగాణ. సాంప్రదాయ వ్యవసాయం, సాంప్రదాయ పంటల నుంచి రైతులను బయటకు తీసుకువచ్చేందుకు రాష్ట్ర ప్రభుత్వం పంటల మార్పిడి వైపు నడిపిస్తున్నదని పేర్కొన్నారు.తెలంగాణ ప్రభుత్వ ప్రోత్సాహం మూలంగా ఆయిల్ పామ్ సాగులో దేశంలో తెలంగాణ ద్వితీయ స్థానంలో నిలిచింది. మరో ఏడాదిలో ప్రథమస్థానంలో నిలవనున్నది. ప్రభుత్వ చర్యల



మూలంగా తెలంగాణ రైతు ఇప్పుడిప్పుడే నిలదొక్కుకుంటున్నాడు. భవిష్యత్‌లో తెలంగాణ రైతు దేశానికే ఆదర్శంగా నిలవబోతున్నాడని చెప్పారున. సీఎం కేసీఆర్ వ్యవసాయ అనుకూల విధానాలు దేశం దృష్టిని ఆకర్షిస్తున్నాయని తెలిపారు. అనంతరంపెబ్బేరు చెలిమిల్ల 5వ వార్డు నుంచి బీజేపీని వీడి బీఅర్ఎస్‌లో చేరిన 100 మంది నాయకులు, కార్యకర్తలకు కండువాలు కప్పి పార్టీలోకి ఆహ్వానించారు.

# జీ 20కు హస్తిన ముస్తాబు

(మొదటిపేజీ తరువాయి)

ఆతిథ్యాన్ని పరిచయం చేసేలా హోటళ్ల నిర్వాహకులు చర్యలు తీసుకుంటున్నారు. అతిథులకు స్వాగతం పలకడం దగ్గర నుంచి వారికి బస, వంటకాల ఏర్పాట్లపై హోటల్లు ప్రత్యేక దృష్టి పెట్టాయి. అతిథులను మెప్పించేందుకు హోటళ్లను రంగుల పూలతో అందంగా అలంకరిస్తున్నాయి. వారికి ఏమాత్రం లోటు రాకుండా చర్యలు తీసుకుంటున్నారు. అతిథులకు విదేశీ వంటకాలతో పాటు భారత రుచులను పరిచయం చేసేందుకు ఏర్పాట్లు చేస్తున్నట్లు తాజ్ హోటల్ నిర్వాహకులు తెలిపారు. ప్రపంచ దేశాధినేతలు బస చేసే గదులను పోలీసులు, భద్రతా సిబ్బంది ఇప్పటికే తనిఖీ చేశారని చెప్పారు. జీ-20 అతిథులకు అంతర్జాతీయ వంటకాలతో సహా 250కి పైగా రుచికరమైన వంటకాలను అందించాలని లలిత్ హోటల్ ప్రణాళిక చేస్తోంది. తృణధాన్యాల ఆధారిత వంటకాలను కూడా తయారు చేస్తోంది. అమెరికా అధ్యక్షుడు జో బై డెన్ , బ్రిటిష్ ప్రధాని రిషి సునాక్ సహా 24 దేశాధినేతలు సమావేశాలకు హాజరుకానున్న నేపథ్యంలో ఆతిథ్యానికి ఎటువంటి వంటి లోటు లేకుండా చర్యలు తీసుకుంటున్నారు. అలాగే అతిథులు బస చేస్తున్న హోటళ్ల వద్ద కఠిన భద్రతా ఏర్పాట్లు చేస్తున్నారు. అమెరికా అధ్యక్షుడు జోబైడెన్‌కు ఐటీసీ మౌర్యలో బస ఏర్పాటు చేశారు. ఇప్పటికే ఆయా దేశాల ఇంటలిజెన్స్ సంస్థల అధికారులు ఢిల్లీకి చేరుకొని తమ అధినేతల రాకపోకల ఏర్పాటు చేసుకుంటున్నారు. రష్యా అధ్యక్షుడు పుతిన్, చైనా అధ్యక్షుడు జిన్ పింగ్ జి 20 శిఖరాగ్ర సదస్సుకు హాజరు కావడం లేదు. ఈ రెండు దేశాల అధ్యక్షులు హాజరు కాకపోవడం వెనుక కారణాలపై రకరకాల చర్చలు జరుగుతున్నాయి. జీ-20 సదస్సుకు సంబంధించిన ఢిల్లీలోని కీలకమైన వేదికలు, ఇతర ప్రాంతాల వద్ద సన్నద్ధతను ఆదివారం కొందరు ప్రభుత్వ ప్రతినిధులు పరిశీలించారు. ఆ బృందంలో ఢిల్లీ లెఫ్టినెంట్ గవర్నర్ వీకే సక్సేనాతో పాటు ప్రధానమంత్రి ముఖ్య కార్యదర్శి పీకే మిశ్ర ఉన్నారు. జీ 20 సదస్సుకు ఢిల్లీని సర్వాంగ సుందరంగా తీర్చిదిద్దారు. రోడ్లకు ఇరువైపులా ల్యాండ్ స్కేపింగ్ చేసి చూడముచ్చటగా తీర్చిదిద్దారు. ఢిల్లీ అంతర్జాతీయ విమానాశ్రయం నుంచి జి20 సదస్సు జరిగే భారత మండపం వరకు పరిసరాలన్నిటిని అలంకరించారు. రోడ్లకు ఇరువైపులా జీ 20 దేశాల జెండాలు నిలబెట్టారు. భారతదేశ కళావైభవ చిహ్నాలు అన్నిటిని రోడ్ల ముఖ్య కూడలిలో అందంగా అమర్చారు. వివిధ రాష్ట్రాలకు సంబంధించిన కళారూపాల ఫ్లెక్సీలను విమానాశ్రయం వద్ద ప్రదర్శనగా పెట్టారు. ప్రపంచ స్థాయి ప్రమాణాలకు అనుగుణంగా ఈ డెకరేషన్స్ చేశారు. సెప్టెంబర్ 8, 9, 10 తేదీల్లో ఢిల్లీ అనధికారిక లాక్ డౌన్ లోకి వెళ్లబోతోంది. ఢిల్లీకి వచ్చే దాదాపు 100కు పైగా రైళ్లను ఈ మూడు రోజుల్లో రద్దు చేశారు. అలాగే విమాన రాకపోకలు సైతం రద్దు చేశారు. సెంట్రల్ ఢిల్లీని పూర్తిగా శత్రు దుర్భేద్యంగా మార్చేశారు. కేవలం సెంట్రల్ ఢిల్లీలో నివసించేవారు మినహా మిగిలిన వారెవరిని సెంట్రల్ ఢిల్లీలోకి అనుమతించడం లేదు. దేశాధినేతల వాహనాల రాకపోకలకు ఎలాంటి ఆటంకం లేకుండా ఉండేందుకే ఈ మూడు రోజులపాటు ఆంక్షలు విధించినట్లు అధికార వర్గాలు వెల్లడించాయి


**జీ 20కు జిన్ పింగ్ దూరం**

భారత్ ప్రతిష్టాత్మకంగా నిర్వహిస్తున్న జీ-20 సదస్సుకు చైనా అధ్యక్షుడు జీ జిన్ పింగ్ హాజరు కావడం లేదని ఆ దేశ విదేశాంగ శాఖ తెలిపింది. సోమవారం రోజు ఈ విషయాన్ని వెల్లడించింది. ఆయనకు బదులుగా ప్రధాని లీ చియాంగ్ భారత్ రాబోతున్నట్లు ప్రకటించింది. అయితే సెప్టెంబర్ 9, 10 తేదీల్లో దిల్లీలో జరిగే జీ-20 సదస్సుకు చైనా బృందానికి లీ చియాంగ్ నాయకత్వం వహిస్తారని పేర్కొంది. 2020 జూన్ లో తూర్పు లద్దాఖ్ లోని గల్వాన్ లోయలో భారత సైన్యంపై చైనా సైనికులు దాడిచేశారు. ఈ ఘటనలో 20 మంది భారత జవాన్లు అమరులు అయ్యారు. ఈ వివాదంతో చైనా, భారత్ మధ్య ఉద్రిక్తలు పెరిగిపోయాయి. తాజాగా భారత్ ఓ వైపు జీ-20 సదస్సుకు ఏర్పాట్లు చేస్తుంటే.. చైనా మాత్రం మరో వివాదంతో ముందుకు వస్తోంది. సరిహద్దుల్లోని వివాదాస్పద ప్రాంతాలతో పాటు అరుణాచల్ ప్రదేశ్, అక్సాయ్ చిన్, తైవాన్, దక్షిణ చేనా సముద్రాలను తమ దేశంలోని భూభాగంలో చెబుతూ సరికొత్త మ్యాప్ తో గొడవకు సిద్ధం అవుతోంది. దీనిపై భారత్ ఇప్పటికే తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేయగా... జిన్ పింగ్ భారత్ రావడం లేదు. దేశ రాజధాని ఢిల్లీలో జరగనున్న ఉ 20 సమ్మిట్‌కి అన్ని ఏర్పాట్లు పూర్తవుతున్నాయి. దేశాల అధినేతలు, ప్రతినిధులు వస్తుండడం వల్ల భద్రతకు ఎలాంటి ఇబ్బంది కలగకుండా చాలా జాగ్రత్తలు తీసుకుంటోంది కేంద్ర ప్రభుత్వం. ఇప్పటికే పారామిలిటరీ బలగాలను రంగంలోకి దింపింది. ఢిల్లీ పోలీసులు కూడా భద్రతను కట్టుదిట్టం చేశారు. సెక్యూరిటీని మరింత పటిష్ఠం చేసేందుకు టెక్నాలజీని వినియోగిస్తున్నారు. ఆర్టిఫిషియల్ ఇంటిలిజెన్స్ మాడ్యూల్స్‌తో నిఘా పెడుతున్నారు. ఏఐ ఆధారిత కెమెరాలు ఏర్పాటు చేశారు. వీటి ద్వారా ఉ 20 సమ్మిట్ వేదిక పరిసరాల్లో చీమ చిటుక్కుమన్నా కనిపెట్టేస్తారు భద్రతా సిబ్బంది. అనుమానాస్పదంగా ఎవరు తిరిగినట్టు కనిపించినా వెంటనే గుర్తిస్తాయి ఈ కెమెరాలు. వీటితో పాటు సాఫ్ట్‌వేర్ అలార్ట్స్ కూడా ఏర్పాటు చేశారు.గోడలు ఎక్కడం, పరిగెత్తడం, వంగి నడవడం లాంటివి చేస్తే ఈ ఏఐ కెమెరాలు సెక్యూరిటీ సిబ్బందిని అలెర్ట్ చేస్తాయి. కమాండోలతో పాటు ఇండియన్ ఆర్మీ స్నైపర్స్ భారీ బిల్డింగ్‌లపై పహారా కాయనున్నారు. వీరితో పాటు ఇంటర్నేషనల్ ఇంటిలిజెన్స్ ఏజెన్సీలకు చెందిన సిబ్బంది కూడా ఢిల్లీకి రానుంది. అమెరికాకి చెందిన అఎం,యూకేకి చెందిన ఓఎ-6, చైనాకి చెందిన ఏజెన్సీలు ఇప్పటికే ఢిల్లీకి చేరుకున్నాయి. తమ అధినేతలకు, ప్రతినిధులకు భద్రత కల్పించేందుకు తామే సెక్యూరిటీ ప్లాన్ సిద్ధం చేసుకున్నాయి ఈ ఏజెన్సీలు. ఇక ఈ సదస్సు పరిసర ప్రాంతాలను క్షుణ్ణంగా పరిశీలిస్తున్నారు. ఇండియన్ ఎయిర్ ఫోర్స్ (ఎంఈ)తో పాటు ఆర్మీ హెలికాప్టర్లు జల్లెడ పడుతున్నాయి. యాంటీ డ్రోన్ సిస్టమ్‌ని కూడా ఏర్పాటు చేయనున్నారు.

### నీటి కోసం తండ్లాడిన నేలల్లో


# సుజల దృశ్యం సాక్షాత్కారం

### మంత్రి కేటీఆర్



హైదరాబాద్ - ప్రభాత సూర్యుడు : నీటికోసం తండ్లాడిన నేలల్లో సుజల దృశ్యం సాక్షాత్కారమవుతున్నదని మంత్రి కేటీఆర్ అన్నారు. పాలమూరు-రంగారెడ్డి ఎత్తిపోతల పథకం ఆవిష్కృతమవుతున్నదని, తెలంగాణ జలవిజయ పతాకం సగర్వంగా ఎగురుతున్నదని చెప్పారు. తెలంగాణ సాగునీటిరంగంలో పీఆర్ఎల్ఐ మరో కాళేశ్వరమని సామాజిక మాధ్యమం ఎక్స్ (ట్విట్టర్) వేదికగా వెల్లడించారు. అవాంతరాలను, అడ్డంకులను అధిగమిస్తూ.. కుట్రలను, కేసులను గెలుస్తూ జలసంకల్పంతో అనుమతులు సాధించామన్నారు. దశాబ్దాల కలను సాకారం చేస్తూ పాలమూరు-రంగారెడ్డి ప్రాజెక్టు పూర్తవుతున్నదని తెలిపారు. బిరబిరా కృష్ణమ్మ బీళ్లకు నీళ్లందించనున్నదని చెప్పారు. ఇది తెలంగాణ జలశక్తి అని, కేసీఆర్ ప్రభుత్వ చిత్తశుద్ధి అని ట్వీట్ చేశారు.

# ఈటెల రాజేందర్ కు తప్పిన ప్రమాదం



కరీంనగర్- ప్రభాత సూర్యుడు : బీజేపీ ఎమ్మెల్యే ఈటల రాజేందర్ కాన్వాయ్ రోడ్డు ప్రమాదానికి గురైంది. అయితే బీజేపీ ప్రచార కమిటీ ఛైర్మన్, హుజూరాబాద్ ఎమ్మెల్యే ఈటెల రాజేందర్ కు తృటిలో ప్రమాదం తప్పిపోయింది. వీణవంక పర్యటనకు వెళ్లి వస్తుండగా మానకొండుర్ మండలం లలితపూర్ లో ఈటెల కాన్వాయ్ ప్రమాదానికి గురైంది. గొర్రెలు అడ్డురావడంతో ముందు వెళ్తున్న కాన్వాయ్ ఒక్కసారిగా బ్రేక్ వేయడంతో ప్రమాదం జరిగింది. ముందు వెళ్తున్న వాహనాన్ని ఈటెల ప్రయాణిస్తున్న వాహనం ఢీకొట్టింది. ఈటల క్షేమంగా ఉన్నారని, ఎవరికీ ఎలాంటి గాయాలు కాలేదని తెలుస్తోంది. ఎమ్మెల్యేకు ఎలాంటి గాయాలు కాలేదని తెలియగానే ఆయన అభిమానులు, బీజేపీ శ్రేణులు ఊపిరి పీల్చుకున్నాయి. కరీంనగర్ జిల్లా మానకొండూరు మండలం, లలితాపూర్ గ్రామం వద్ద తాను ప్రయాణిస్తున్న వాహనానికి, తన సిబ్బంది ఉన్న వాహనానికి ప్రమాదం జరిగిందని ఎమ్మెల్యే ఈటల తెలిపారు. చీకటి పడడంతో ఎదురుగా వస్తున్న గొర్రెల మందను చివరి నిమిషంలో చూసి డ్రైవర్ ఒక్కసారిగా బ్రేక్ వేశాడు. దాంతో వెనక వస్తున్న ఎస్కార్ట్ వాహనం తాను ఉన్న వాహనానికి ఢీ కొట్టడంతో వాహనం స్వల్పంగా దెబ్బతిందని చెప్పారు. భగవంతుని దయవల్ల, ప్రజల ఆశీస్సులతో తనతో పాటు అందరూ క్షేమంగా ఉన్నారని, ఎవరికీ ఎలాంటి గాయాలు కాలేదని ట్విట్టర్ (ఎక్స్)లో వెల్లడించారు.

# మందమర్రిలో దారుణం

అదిలాబాద్- ప్రభాత సూర్యుడు : మంచిర్యాల జిల్లా మందమర్రిలో దారుణం చోటు చేసుకుంది. మేకను ఎత్తుకెళ్లారనే నెపంతో మేక యజమానులు.... ఇద్దరు వ్యక్తులపై దాడికి పాల్పడ్డారు. దాడి చేయడమే కాకుండా తలకిందులుగా వేలాడదీసి, కింద నిప్పు పెట్టారు. అలా ఉండగానే కర్రలతో చితకబాదారు. మేకలను మాయం చేసింది మీరేనని ఒప్పుకోమంటూ వేధించారు. అలాగే మేక పోయినందుకు గాను 3 వేల రూపాయలు తమకు చెల్లించాలంటూ హింసించారు. ఈ అమానుష ఘటన ఆలస్యంగా వెలుగులోకి వచ్చింది. కేసు నమోదు చేసుకున్న పోలీసులు దర్యాప్తు చేస్తున్నారు. మంచిర్యాల జిల్లా మందమర్రికి చెందిన కొమురాజుల రాములు, అతని భార్య స్వరూప, కుమారుడు శ్రీనివాస్ అంగడి బజార్ ప్రాంతంలో నివాసం ఉంటున్నారు. యాపల్ ప్రాంతంలోని రైల్వే ట్రాక్ సమీపంలోని గంగనీళ్ల పంపుల వద్ద షెడ్డు వేసి మేకలు పెంచుకుంటున్నారు. అయితే ఈ మందను చూసుకోవడానికి 19 ఏళ్ల తేజ అనే యువకుడిని పనిలో పెట్టుకున్నారు. తేజనే మేకలు కాస్తూ వస్తున్నాడు. అయితే అతని తల్లి పారిశుధ్య కార్మికురాలిగా పని చేస్తోంది. ఈక్రమంలోనే ఎనిమిది రోజుల కిందట షెడ్డు నుంచి ఒక మేక కనిపించకుండా పోయింది. విషయం తెలుసుకున్న యజమాని తేజపై అనుమానం వ్యక్తం చేశాడు. నువ్వే మేకును దొంగిలించావంటూ వాదించాడు. ఏరియాకు చెందిన తాపీ మేస్త్రీ శ్రావణ్ వద్ద కూలీ పనులు చేస్తున్న చిలుముల కిరణ్ అనే వ్యక్తితో కలిసి మేకను దొంగిలించి ఉంటావంటూ తెలిపాడు. ఈక్రమంలోనే తేజతో పాటు కిరణ్ ను మేకల షెడ్డు వద్దకు రావాలని పిలిచాడు. అప్పటికే రాములుతో పాటు ఆయన కుటుంబ సభ్యులు కూడా అక్కడే ఉన్నారు. వీరంతా ముందుగా తేజ, కిరణ్ లను దొంగతనం ఒప్పుకోమని గొడవ చేశారు. వారిద్దరూ తాము మేకను దొంగిలించలేదని ఎంత వాదించినా వినకుండా... వారిని తలకిందులుగా వేలాడదీశారు. ఆపై కింద నిప్పు పెట్టి మరీ కుటుంబ సభ్యులంతా కలిసి తీవ్రంగా కొట్టారు. మూడు వేల రూపాయలు ఇస్తే తప్ప వదిలిపెట్టేది లేదని అన్నారు. తాపీ మేస్త్రీ శ్రావణ్... డబ్బులు ఇస్తానని హామీ ఇచ్చి కిరణ్ ను విడిపించుకొని వెళ్లాడు. అయితే కిరణ్ కనిపించకుండా పోవడంతో అతని చిన్నమ్మ నిట్టూరి సరిత పోలీసులకు ఫిర్యాదు చేసింది. కేసు నమోదు చేసుకున్న పోలీసులు విచారణ జరపడంతో ఈ దారుణ ఘటన వెలుగులోకి వచ్చింది.

# రాజకీయాలకు అతీతంగా మట్టి సేకరణ

### కేంద్ర మంత్రి కిషన్ రెడ్డి



హైదరాబాద్ - ప్రభాత సూర్యుడు

దేశవ్యాప్తంగా రాజకీయాలకు అతీతంగా కేంద్ర ప్రభుత్వం మేరీ మాటి.. మేరా దేశ్ కార్యక్రమం కొనసాగిస్తుందని బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు, కేంద్ర మంత్రి కిషన్ రెడ్డి అన్నారు. 75 సంవత్సరాల ఆజాద్ కీ అమృత్ మహోత్సవ సందర్భంగా ఈ కార్యక్రమాన్ని ప్రధాని మోడీ చేపట్టారు. గ్రామ స్థాయి నుండి పట్టణ స్థాయి వరకు ప్రతి ఒక్కరూ ఈ మట్టి సేకరణ కార్యక్రమంలో పాల్గొనాలి. స్వాతంత్రం కోసం పోరాడిన మహా నేతల ఇండ్లకు వెళ్ళి మట్టిని సేకరించాలి. అక్టోబర్ 31 సర్దార్ వల్లభాయ్ పటేల్ జయంతి సందర్భంగా ఈ కార్యక్రమం ముగుస్తుంది. కర్తవ్య పథ్ లో ప్రధాని మోడీ స్వయంగా ఈ కళశాలను స్వీకరిస్తారు. ఈ మట్టితోనే ఢిల్లీ లో అమరవీరుల స్మారక స్థూపాన్ని నిర్మిస్తున్నారు. తెలంగాణలో రాజకీయాల కతీతంగా ప్రతిఒక్కరూ ఈ కార్యక్రమంలో భాగస్వామం కావాలని అయన పిలుపు నిచ్చారు.

# బీసీ సింహ గర్జన పోస్టర్ ఆవిష్కరణ

కమాన్ పూర్ - ప్రభాత సూర్యుడు



కమాన్ పూర్ మండల కేంద్రంలో బీసీ సింహ గర్జన గోడ పోస్టర్ బీసీ సంక్షేమ సంఘం మండల అధ్యక్షుడు పొన్నం నవీన్ కుమార్ ఆధ్వర్యంలో సోమవారం ఆవిష్కరించారు. ఈనెల 10న హైదరాబాద్ లోని సరూర్ నగర్ లో జరిగే ఈ కార్యక్రమానికి బీసీ నేతలు హాజరవుతున్నారని పేర్కొన్నారు. పెద్దపల్లి జిల్లా నుండి అధిక సంఖ్యలో హాజరుకావాలని నల్లవెల్లి శంకర్ కోరారు. ఈ కార్యక్రమానికి కార్యక్రమానికి ఈ బీసీ సంక్షేమ సంఘం పెద్దపెల్లి జిల్లా అధ్యక్షులు నల్లవెల్లి శంకర్ మాజీ ఎంపీపీ మల్యాల రామచంద్రన్ గౌడ్ రైతు సమన్వయ సమితి కన్వీనర్ గడప కృష్ణమూర్తి స్థానిక సర్పంచి నీలం శ్రీనివాస్ సరిత కాంగ్రెస్ పార్టీ జిల్లా ప్రధాన కార్యదర్శి రంగు సత్యనారాయణ గౌడ్ బిజెపి సీనియర్ నాయకులు మచ్చగిరి రాము లు మాట్లాడుతూ మేం ఎంతో మాకు అంత వాటా దక్కాలని చట్టసభల్లో మన మాట మనకు దక్కాలని చట్టసభల్లో ప్రాతినిథ్యం వహిస్తే బీసీలకు న్యాయం జరుగుద్ది అని అన్నారు ఈ కార్యక్రమంలో తోట రాజ్ కుమార్ విజయ్ కుమార్ గౌడ్ నగునూ నరసయ్య గౌడ్ వెంకన్న బాద్రపు శంకర్ బోనాల సత్యనారాయణ పటేల్ వెంగలి రాజయ్య గౌడ్ కమ్మవారి అనిల్ గౌడ్ లక్ష్మీరాజ్యం గర్రెపల్లి సత్యం మిట్ట సందీప్ నారగోని సతీష్ కుమార్ సుంచు శ్రీనివాస్ జంగా పెల్లి తిరుపతి మెతుకు ఈశ్వర్ తదితరులు పాల్గొన్నారు.

# రిసెప్షన్ రోజే.. కరెంట్ షాక్ తో వరుడు మృతి

మెదక్- ప్రభాత సూర్యుడు

అంగరంగ వైభవంగా రెండు రోజుల క్రితం పెళ్లి జరిగింది. బంధువులు, స్నేహితులతో ఆ ఇళ్లు కలకలలాడింది. ఆ వధువు కూడా ఎన్నో ఆశలతో అత్తారింట్లో అడుగుపెట్టింది. అయితే కరెంట్ షాక్ రూపంలో మృత్యువు ఆ కుటుంబాన్ని కన్నీటిలో ముంచేసింది. వధువు నుదిటి కుంకుమ చెరిపేసింది. ఆమె ఆశలను తుంచేసింది. రిసెప్షన్ రోజే వరుడు విద్యుత్ షాక్ తో మృతి చెందాడు. వివరాల ప్రకారం సిద్ధిపేట జిల్లాలోని వెంకటాపూర్ గ్రామానికి చెందిన నిరంజన్ కు గత శనివారం ఘనంగా వివాహం జరిగింది. నిరంజన్ ఇందిరానగర్ ప్రభుత్వ పాఠశాలలో భౌతిక శాస్త్ర ఉపాధ్యాయుడుగా పని చేస్తున్నాడు. మంచి ఉద్యోగం, జీతం, మంచి కుటుంబం దీనికి తోడు అందమైన అమ్మాయిని పెళ్లాడాడు నిరంజన్. ఇక అంతా సంతోషంగా పెళ్లి సంబరాలు చేసుకున్నారు. రిసెప్షన్ పెట్టుకున్నారు. అందరూ ఈ కార్యక్రమానికి రెడీ అవుతుండగా అనుకోని సంఘటన జరిగింది. వరుడుకు కరెంట్ షాక్ తగిలింది. దీంతో వరుడిని వెంటనే ఆసుపత్రికి తీసుకు వెళ్లారు కుటుంబ సభ్యులు అయితే అప్పటికే నిరంజన్ మర ణించాడు. దీంతో కుటుంబం ఒక్కసారిగా కుప్ప కూలిపోయింది.

పెళ్లి జరిగిన ఇంట్లో ఇలా జరగడం ఎవరు జీర్ణించుకోలేకపోతున్నారు. దీంతో ఆ గ్రామంలో కూడా విషాద ఛాయలు అలుము కున్నాయి. పెళ్లి చేసుకొని ఆనందంగా ఉండాల్సిన తమ కొడుకు అందనంత దూరాలకు వెళ్లిపోవడంతో ఆ తల్లిదండ్రులు గుండెలు పగిలేలా రోదిస్తున్నారు. ఇక పెళ్లి కూతరు ఆమె కుటుంబం కూడా ఈ ఘటనతో షాక్ గురయ్యారు. నూతన వధువు తన జీవితం ఇలా అయిపోవడంతో కన్నీరు మున్నీరవుతుంది. ఆమె బాధను మాటల్లో వర్ణించలేకపోతున్నారు.

# సరూర్ నగర్ మహిళా పిఎస్ పై ఏసీబీ దాడి

హైదరాబాద్ - ప్రభాత సూర్యుడు


సరూర్ నగర్ మహిళ పోలీసు స్టేషన్ లో ఏసీబీ అధికారులు దాడులు నిర్వహించారు. మహిళా ఏఎస్ఐ సరళ, కానిస్టేబుల్ నరసింహ 498 కేసు విషయంలో 5000 రూపాయలు డిమాండ్ చేసినట్లు సమాచారం. ఈ నేపథ్యంలో వచ్చిన పిర్యాదుపై ఏసీబీ దాడి జరిపినట్లు తెలుస్తోంది. సీబీ సోదాలకు సంబంధించి పూర్తి స్థాయిలో వివరాలు తెలియాల్సి ఉంది.

# పారాచూట్ నాయకులకు టికెట్ ఇవ్వొద్దంటూ

### మధుయాష్కీకి వ్యతిరేకంగా గాంధీభవన్‌లో వెలసిన పోస్టర్లు

హైదరాబాద్ - ప్రభాత సూర్యుడు

నిజామాబాద్ మాజీ ఎంపీ, ప్రచార కమిటీ చైర్మన్ మధుయాష్కీకి వ్యతిరేకంగా గాంధీభవన్‌లో వెలసిన పోస్టర్లు కలకలం సృష్టిస్తున్నాయి. పారాచూట్ నాయకులకు టికెట్ ఇవ్వొద్దంటూ పార్టీ రాష్ట్ర కార్యాలయం వద్ద గుర్తు తెలియని వ్యక్తులు పోస్టర్లు అంటించారు. సేవ్ ఎల్బీనగర్ కాంగ్రెస్ మధు యాష్కి గో బ్యాక్ టు నిజామాబాద్ అంటూ పోస్టర్లు వెలిశాయి. 2009 ఎన్నికల్లో నిజామాబాద్ ఎంపీగా విజయం సాధించిన మధుయాష్కి.. తెలంగాణ ఆవిర్భావం తర్వాత జరిగిన రెండు ఎన్నికల్లోనూ ఓటమి చవిచూశారు. దీంతో ఆయన ఈసారి పార్లమెంటు ఎన్నికలకు దూరంగా ఉండాలని నిర్ణయిం చుకున్నారు. ఇందులో భాగంగా నిజామాబాద్ జిల్లా నుంచి కాకుండా.. హైదరాబాద్‌లోని ఎల్బీ నగర్ అసెంబ్లీ నియోజకవర్గం నుంచి ఎమ్మెల్యే టికెట్ కోసం దరఖాస్తు చేసు కున్నారు.




స్థానిక నేతలైన మాజీ ఎమ్మెల్యే మల్‌రెడ్డి రంగారెడ్డి సోదరుడు, మరో నాయకుడు జక్కిడి ప్రభాకర్ రెడ్డి సైతం అభ్యర్థిత్వం కోసం అప్లయ్ చేసుకున్నారు. దీంతో పోటీ త్రిముఖంగా మారింది. పార్టీని కాపాడు కుంటూ వస్తున్న తమకు కాకుండా మరొకరికి టికెట్ ఇస్తారేమోనని అక్కడి నాయకులు ఆందో ళనకు గురవుతున్నారు. యాష్కికి వ్యతిరేకంగా గాంధీ భవన్‌లో పోస్టర్లు వెలవడం గమనార్హం.

### సనత్ నగర్‌లో

# మంత్రుల పర్యటన



హైదరాబాద్ - ప్రభాత సూర్యుడు

విదేశాలలో విద్యను అభ్యసించే స్థాయికి ప్రభుత్వ పాఠశాలల విద్యార్థులను తీర్చిదిద్దుతామని మంత్రులు సబితా ఇంద్రారెడ్డి, తలసాని శ్రీనివాస్ యాదవ్ అన్నారు. సనత్ నగర్ లో 2.22 కోట్ల రూపాయల వ్యయంతో చేపట్టనున్న అభివృద్ధి పనులు, బన్సీలాల్ పేట లోని ప్రభుత్వ పాఠశాలలో 1.84 కోట్ల రూపాయల వ్యయంతో చేపట్టనున్న అదనపు తరగతి గదుల నిర్మాణ పనులను మంత్రులు ప్రారంభించారు. వచ్చే విద్యా సంవత్సరం నుండి మేకల మండి పాఠశాలను హై స్కూల్ గా అప్ గ్రేడ్ చేస్తున్నట్లు విద్యా శాఖ మంత్రి ప్రకటించారు. ముఖ్యమంత్రి కెసిఆర్ ఆదేశాల మేరకు పేద విద్యార్థులు అధికంగా విద్యను అభ్యసించే ప్రభుత్వ పాఠశాలల్లో మన బస్తీ మన బడి కార్యక్రమంతో అన్ని ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థులకు అన్ని సౌకర్యాలు, వసతులు కల్పిస్తున్నాం . తెలంగాణ రాష్ట్రం వచ్చిన తర్వాత సన్నబియ్యం తో నాణ్యమైన భోజనం, వారానికి 3 రోజులు రాగిజావా అందిస్తున్నాని అన్నారు.

## ఆరె కటికలకు రాష్ట్ర ప్రభుత్వం అండగా



కోరుట్ల- ప్రభాత సూర్యుడు

ఆర్థికంగా, రాజకీయంగా, విద్యాపరంగా, సామాజికంగా అన్ని రంగాల్లో వెనుకబడి ఉన్న కులాలలో మరింత వెనుకబడిన కులం ఆరె కటికలది ఆని ఆరె కటికలకు తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం అండగా ఉంటుందని కోరుట్ల ఎమ్మెల్యే కల్వకుంట్ల విద్యాసాగర్ రావు అన్నారు. సోమవారం పట్టణంలోని అరె కటికే సంఘం నూతన భవనాన్ని కోరుట్ల ఎమ్మెల్యే కల్వకుంట్ల విద్యాసాగర్ రావు, బిఆర్ఎస్ పార్టీ ఎమ్మెల్యే అభ్యర్థి డాక్టర్ కల్వకుంట్ల సంజయ్ తోకలసి ప్రారంభించారు.. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ తెలంగాణ రాష్ట్రంలో ఉన్న దాదాపు 15 నుంచి 20 లక్షల మంది అరె కటికలను గత పాలకులు నిర్లక్ష్యం చేశారని, తెలంగాణ రాష్ట్ర సాధన ఆనంతరం తెలంగాణలోని 33 జిల్లాల్లో ఆరె కటికెలు కబేళాలలో మాంసాన్ని కొనుగోలు చేయడం, విక్రయించడానికి మాంసం మార్కెట్లులను ప్రారంభించినట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో వారితోపాటు బిఆర్ఎస్ పట్టణ అధ్యక్షులు అన్నం అనిల్, కౌన్సిలర్ గుండోజి శ్రీనివాస్,ఆరె కటిక అధ్యక్షులు గోడికె అశోక్, ఉపాధ్యక్షులు గోడికె మధు, ప్రధాన కార్యదర్శి గోడికె శ్రీనివాస్ ,కోశాధికారి గోడికె నేహా, సంఘ సభ్యులు రాజ్ కిషన్ , బిఆర్ఎస్ పార్టీ సీనియర్ నాయకులు యూత్ నాయకులు తదితరులు పాల్గొన్నారు..

# దొంగల ముఠా అరెస్టు

సికింద్రాబాద్ - ప్రభాత సూర్యుడు

రద్దీగా ఉన్న ప్రదేశాలను ఎంచుకుంటారు.. రోజుకు ఐదు మంది ప్రయాణికుల దగ్గర దొంగతనం చేయడమే లక్ష్యంగా పెట్టుకుంటారు.... ఆటోలో ప్రయాణికుల మాదిరిగానే నమ్మిస్తారు.. ఆటో ఎక్కించుకున్న ప్రయాణికుడిని లక్ష్యంగా చేసుకుని దృష్టి మరల్చి సెల్ ఫోన్ లను తస్కరిస్తారు.. ముఠాగా ఏర్పడిన సభ్యులు రిజిస్ట్రేషన్ లేని ఆటోను దొంగతనాలకు వినియోగిస్తూ ముఠా సభ్యులే ప్రయాణికులుగా నమ్మిస్తూ అమాయక ప్రయాణికుల వద్ద విలువైన వస్తువులను అపహరించిన ఘటనలో బోయిన్పల్లి పోలీసులు ఇద్దరు వ్యక్తులను అరెస్టు చేయగా మరో ముగ్గురు రిమాండ్ లో ఉన్నట్లు బేగంపేట ఏసీపి రామలింగరాజు పేర్కొన్నారు.. బోయిన్పల్లి నుండి కొంపల్లి వరకు ఆటో లో ఎక్కించుకొని దొంగతనం చేస్తున్న క్రమంలో నిందితులో పట్టుబడినట్లు ఏసిపి రామలింగ రాజు తెలిపారు.. అమాయక ప్రజలను ఆటోలో ఎక్కించుకొని ఫోన్లను విలువైన వస్తువులను అపహరించడమే ఈ ముఠా లక్ష్యంగా పెట్టుకున్నారని, దొంగిలించిన ఫోన్లను జగదీష్ మార్కెట్లో తక్కువ ధరలకే విగ్రహిస్తున్నట్లు విచారణలో వెల్లడైందని పేర్కొన్నారు.

Printed, Published and Owned by CHERUKU UPENDAR, Printed at Akshaya Printers, H/No: 7-83/2, HANUMAN NAGAR COLONY, KUNTLOOR, ABDULLAPURMET MANDAL, HAYATH NAGAR, PIN:501505, RANGAREDDY DISTRICT/ HYDERBAD CITY, TELANAGANA, EDITOR CHERUKU UPENDAR, PUBLICATION at HAMSA PUBLICATIONS, H/No: 7-83/2, HANUMAN NAGAR COLONY, KUNTLOOR, ABDULLAPURMET MANDAL, HAYATH NAGAR, PIN:501505, RANGAREDDY DISTRICT/ HYDERBAD CITY, TELANAGANA, E-mail: upendrabbk@gmail.com, RNI:TELTEL12215